
సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ కృషితో రాజధాని అమరావతి చట్టబద్ధత బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందింది. అమరావతి రైతుల తరఫున వారికి కృతజ్ఞతలు. ప్రధాని మోదీ, అమిత్ షా సహకారానికి ధన్యవాదాలు. పోరాడి విజయం సాధించిన రైతులకు అభినందనలు.



ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ

గురువారం 02.04.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 345 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00

# అమరావతికి అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు


- ఏపికి అమరావతే ఏకైక రాజధాని
- ఎవరూ అంగుళం కూడా కదల్చలేరు
- పార్లమెంటులో బిల్లుపై స్పందించిన సీఎం
- చేనేతలకు అండగా దండగా ప్రజా ప్రభుత్వం
- రాష్ట్రంలో 5 చోట్ల హ్యాండ్లూమ్ క్లస్టర్ల ఏర్పాటు
- సుపరిపాలనా మహాయజ్ఞాన్ని అడ్డుకుంటే సహించేది లేదు
- రాష్ట్రంలో కొందరు చేసేవి హిట్ అండ్ రన్ నేర రాజకీయాలు
- నెల్లూరు జిల్లా వింజమూరులో పేదల సేవలో కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు




నెల్లూరు(జర్నలిస్ట్ ఫైల్) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఇక అమరావతే ఏకైక రాజధాని అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఎవరూ అంగుళం కూడా రాజధానిని కదల్చలేరని ఆయన అన్నారు. అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందటంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. నెల్లూరు జిల్లా వింజమూరులో పేదల సేవలో కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి... ప్రజావేదిక సభలో ప్రసంగించారు. ప్రజా రాజధాని అమరావతి ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక అని.. లోక్‌సభలో చట్టబద్ధత బిల్లుకు ఆమోదం పొందటం ఆంధ్రులకు దక్కిన గౌరవమని సీఎం అన్నారు. బిల్లు ఆమోదంతో అమరావతి భవిష్యత్తుపై ఉన్న సందిగ్ధతకు శాశ్వతంగా తెరపడిందని తెలిపారు. రాజధానిని విశ్వనగరంగా తీర్చిదిద్దుతామని ఆయన వెల్లడించారు. ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాలకు ధన్యవాదాలు తెలిపిన ముఖ్యమంత్రి.. ఈ బిల్లుకు మద్దతు పలికిన పార్టీలకు రాష్ట్ర ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియచేశారు. గత పాలకులు మూడు ముక్కలాటతో విధ్వంసం చేసి రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారని ఆక్షేపించారు. రాజధానికి చట్టబద్ధత కల్పించే అంశంపై అసెంబ్లీలో తీర్మానం పెడితే కనీసం శాసనసభ సమావేశాలకు కూడా ఆ పార్టీ హాజరు కాలేదన్నారు. రాజధాని ప్రాంతాన్ని స్మశానమని, ఏడారి అని, ముంపు ప్రాంతమని ఎగతాళి చేసి ఆనందించారని సీఎం ఆరోపించారు.

**సంక్షేమానికి పెద్దపీట:** ప్రతీ నెలా మొదటి తేదీన పేదల సేవలో ద్వారా పెద్ద ఎత్తున సంక్షేమం చేస్తున్నామని ముఖ్యమంత్రి అన్నారు. కూటమి ప్రభుత్వంలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు అంతా పేదల సేవలో ఉంటున్నామని తెలిపారు. ప్రతీ నెలా రూ. 2,750 కోట్లను పెన్షన్ల కోసం వ్యయం చేస్తున్న ప్రభుత్వం ఏపీనే అని సీఎం వివరించారు. పొరుగున తమిళనాడులో కేవలం రూ. వెయ్యి మాత్రమే పెన్షన్ గా ఇస్తున్నారని అన్నారు. ప్రజలపై ఉన్న అభిమానం తోనే పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాల్ని చేయగలుగుతున్నామని సీఎం వివరించారు.

మిగతా 2లో...



## శాశ్వత రాజధానిగా అమరావతి



న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) : ఏపీకి శాశ్వత రాజధానిగా అమరావతి ఉంటుందని ఎంపీ పురందేశ్వరి తెలిపారు. లోక్‌సభలో అమరావతి బిల్లుపై చర్చలో ఎంపీ మాట్లాడుతూ.. ఆనాడు చర్చ లేకుండా ఏపీ విభజన జరిగిందని అన్నారు. వైసీపీ హయాంలో రాజధానిపై తీవ్ర అస్థిరత నెలకొందని.. రాజధానిపై గత ప్రభుత్వం మూడు ముక్కలాట ఆడిందని విమర్శించారు. అమరావతి తొలి ప్రజా రాజధానిగా గుర్తింపు తెచ్చుకుందని ఎంపీ తెలిపారు. విభజన ఆగ్రహం నుంచి రాజధాని అమరావతి పుట్టిందని వెల్లడించారు. 2లో...

## రాజధానిపై ఊసరవెల్లిలా రంగులు మార్చలేరు



దిల్లీ(జర్నలిస్ట్ ఫైల్): ప్రతి తెలుగువాడి గుండె చప్పుడు అమరావతి' అని అనకాపల్లి భాజపా ఎంపీ సీఎం రమేశ్ అన్నారు. లోక్‌సభలో అమరావతికి చట్టబద్ధత బిల్లు ప్రవేశపెట్టిన సందర్భంగా నిర్వహించిన చర్చలో ఆయన మాట్లాడారు. మిగతా 2లో...

## జై ఆంధ్రప్రదేశ్.. జయహో అమరావతి: నారా లోకేశ్



అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) : ఏపీ రాజధాని అమరావతి చట్టబద్ధతపై లోకసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ బిల్లును గురువారం రాజ్యసభకు ముందుకు వెళ్లనుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. ఏపీ ప్రజల విజయం.. ఇది రైతుల త్యాగాలకు దక్కిన దైవ ఆశీస్సులు అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఎక్స్‌లో పోస్టు చేశారు. "నా రాష్ట్రం ఆంధ్రప్రదేశ్-నా రాజధాని అమరావతి అని ఐదుకోట్ల ఆంధ్రులు గర్వంగా నినదించే చారిత్రాత్మకమైన రోజుకు దేశ పార్లమెంటు వేదిక కావడం చాలా సంతోషంగా ఉంది" అని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు.

మిగతా 2లో...

## శ్రీరాముని ఆశీస్సులతో ధర్మపాలన

- ఒంటిమిట్టలో సీతారాముల కళ్యాణ మహోత్సవం
- పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించిన ముఖ్యమంత్రి దంపతులు



ఒంటిమిట్ట (జర్నలిస్ట్ ఫైల్) : శ్రీరాముని ఆశీస్సులతో ధర్మాన్ని అనుసరించి ధర్మపాలన అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాముడు పేరు వినగానే గుర్తొచ్చేది రామరాజ్యం.. సుపరిపాలన అని వ్యాఖ్యానించారు. ఒంటిమిట్ట సీతారాముల వారి కళ్యాణ మహోత్సవం సందర్భంగా స్వామి వారికి సతీసమేతంగా పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. ముఖ్యమంత్రికి ఆలయ పండితులు స్వామి వార్ల చిత్రపటాన్ని అందించి ప్రసాదాలను అందించారు. అనంతరం జై శ్రీరామ్ నినాదంతో ప్రసంగాన్ని ప్రారంభించారు.

మిగతా 2లో...

## సీఎం చంద్రబాబు కృషి వల్లే.. లోక్‌సభలో బిల్లు ఆమోదం

- ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలి(జర్నలిస్ట్ ఫైల్)ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి కృషి వల్లే రాజధాని అమరావతి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభలో ఆమోదం పొందిందని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ వెల్లడించారు. అమరావతి రైతుల తరపున సీఎం చంద్రబాబుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందినందుకు ప్రధాని మోదీకి సైతం ధన్యవాదాలు తెలియజేశారు. బుధవారం రాజధాని బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందింది. ఈ నేపథ్యంతో తెనాలి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో, బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ..

2 లో..



## అమరావతి రాజధాని బిల్లుకు రాష్ట్ర బీజేపీ స్వాగతం

- కేంద్రానికి పీవీయన్ మాధవ్ కృతజ్ఞతలు



అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) : ఆంధ్రప్రదేశ్‌కు అమరావతిని అధికారిక రాజధానిగా ప్రకటించే దిశగా లోక్‌సభలో బిల్లు ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీయన్ మాధవ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయం రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధికి కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు.

మాధవ్ మాట్లాడుతూ, రాష్ట్ర విభజన అనంతరం కొనసాగుతున్న రాజధాని వివాదానికి ఈ బిల్లు ద్వారా శాశ్వత పరిష్కారం లభించే అవకాశం ఉందన్నారు. అమరావతిని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తే ఆంధ్రప్రదేశ్‌ను ప్రధాన ఆర్థిక కేంద్రంగా తీర్చిదిద్దవచ్చని, దీంతో పెట్టుబడులు పెరిగి యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు కలుగుతాయని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని అభిప్రాయ పడ్డారు. ప్రధాని నరేంద్ర మోదీ అందిస్తున్న సహకారం, మార్గనిర్దేశానికి రాష్ట్ర బీజేపీ తరపున

2 లో

## అమరావతికి చట్టబద్ధత బిల్లు.. లోక్‌సభ ఆమోదం



దిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) : ఏపీ రాజధాని అమరావతికి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఏపీ పునర్విభజన చట్ట సవరణ పేరుతో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ లోక్‌సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టారు. అనంతరం సుమారు రెండు గంటలపాటు దీనిపై చర్చ జరిగింది. తెదేపా, భాజపా, జనసేన, కాంగ్రెస్, వైకాపా, సమాజ్‌వాదీ సహా పలు పార్టీల ఎంపీలు చర్చలో పాల్గొన్నారు. అనంతరం బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపినట్లు స్పీకర్ స్థానంలో ఉన్న తెన్నేటి కృష్ణప్రసాద్ ప్రకటించారు.

ఈ బిల్లు గురువారం రాజ్యసభ ముందుకు రానుంది. లోక్‌సభలో ఆమోదం పొందిన అనంతరం ఈ బిల్లు రాజ్యసభకు వచ్చినట్లు సెక్రటరీ జనరల్ ప్రకటించారు. గురువారం కేంద్ర మంత్రి నిత్యానంద రాయ్ దీన్ని రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మొదలు దాదాపు గంటసేపు బిల్లుపై చర్చ జరిగే అవకాశం ఉంది.

## అమరావతి బిల్లుతో రాష్ట్రానికి గర్వకారణ క్షణాలు



- ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందడం రాష్ట్ర ప్రజలందరికీ గర్వకారణ క్షణమని ఉప ముఖ్యమంత్రి 2లో...

## వికేంద్రీకరణ పేరుతో వైసీపీ మూడు ముక్కలాట



దిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) : లోక్ సభలో అమరావతి పునర్ వ్యవస్థీకరణ సవరణ బిల్లు (అమరావతి చట్టబద్ధత బిల్లు)ను ప్రవేశపెట్టడంపై కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాజధాని కోసం భూములు త్యాగం చేసిన రైతులు, మహిళలకు అభినందనలు తెలిపారు. మిగతా 2లో...

# ఆనందోత్సాహాలతో ఆలపాటి ఎడ్ల బలప్రదర్శన పోటీలు

- రైతుల ఉత్సాహానికి అద్దం పట్టిన ఎడ్ల ప్రదర్శనలు



తెనాలి (జర్నలిస్ట్ ఫైల్): తెనాలి వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణం ఎడ్ల గర్జనలతో కళకళలాడింది. ఆలపాటి శివరామకృష్ణయ్య మెమోరియల్ జాతీయస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శనలు, ఆవుల పాల ప్రదర్శన పోటీలు రైతులను ఉత్సాహంలో ముంచెత్తుతున్నాయి. నాలుగో రోజు నిర్వహించిన పోటీలు మరింత ఉత్కంఠభరితంగా సాగాయి.

ఈ పోటీలకు డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు ముఖ్య అతిథిగా హాజరై ఎడ్ల బలప్రదర్శనలను ఆసక్తిగా వీక్షించారు. సినీ రచయిత బుర్ర సాయిమాధవ్ ఆత్మీయ అతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యే నక్కా ఆనంద్ బాబు అతిథులకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు ఎన్టీఆర్ విగ్రహానికి, అనంతరం ఆలపాటి శివరామకృష్ణయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా న్యూ క్యాటగిరి, సేద్యపు ఎడ్ల విభాగాల్లో నిర్వహించిన బలప్రదర్శన పోటీలకు పలు ప్రాంతాల నుంచి 11 జతలు పాల్గొని తమ శక్తి సామర్థ్యాలను ప్రదర్శించాయి. ఇదిలా ఉండగా అమరావతిని చట్టబద్ధ రాజధానిగా ప్రకటించే బిల్లును లోక్‌సభలో ఆమోదించిన సందర్భంగా డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు కేక్ కట్ చేసి ఆనందం వ్యక్తం చేశారు.

పోటీల ముగింపులో ఆరుపళ్ళ విభాగంలో విజేతలైన ఎడ్లజతల యజమానులకు అతిథుల చేతుల మీదుగా నగదు బహుమతులు అందజేశారు.

మిగతా 2లో...



## అమరావతి రాజధాని బిల్లుకు రాష్ట్ర బీజేపీ స్వాగతం

(మొదటి పేజీ తరువాయి)

కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో అభివృద్ధి వేగం మరింత పెరుగుతుందని అన్నారు.

రాష్ట్రంలో మావోయిస్టు కార్యకలాపాల నిర్మూలనపై ప్రభుత్వం చేసిన ప్రకటనను స్వాగతిస్తూ, ఇది భద్రతా పరంగా కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రజల్లో భద్రతా భావం పెంపొందించడంలో ఇది ముఖ్యపాత్ర పోషిస్తుందని తెలిపారు.

మొత్తంగా, అమరావతి రాజధాని బిల్లు ప్రవేశపెట్టడం, మావోయిస్టు నిర్మూలనపై చర్యలు రాష్ట్ర రాజకీయ, ఆర్థిక, భద్రతా రంగాలలో కీలక పరిణామాలుగా నిలుస్తాయని మాధవ్ అభిప్రాయపడ్డారు. బీజేపీ, జనసేన, తెలుగు దేశం కూటమి ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తుందని అన్నారు.

## జై ఆంధ్రప్రదేశ్.. జయహో అమరావతి

(మొదటి పేజీ తరువాయి)

**'ఒకే రాష్ట్రం-ఒకే రాజధాని :** "ఒకే రాష్ట్రం-ఒకే రాజధాని నినాదంతో అభివృద్ధి వికేంద్రీకరణ విధానంతో రాజధానిగా అమరావతిని నిర్ణయిస్తూ ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ చేసిన ఏకగ్రీవ తీర్మానానికి చట్టబద్ధత కల్పించే అమరావతి బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టి, ఆమోదించడం కోట్లాది ప్రజలు గర్వించదగ్గ సందర్భం. కేంద్రప్రభుత్వానికి, మద్దతుగా నిలిచిన పార్టీలకు కృతజ్ఞతలు. ఇది ఐదుకోట్ల ఆంధ్రుల ఆకాంక్ష అమరావతి విజయం.. ఆంధ్రప్రదేశ్ ప్రజల విజయం.. ఇది రైతుల త్యాగాలకు దక్కిన దైవ ఆశీస్సులు.. శాంతియుత పోరాటానికి దక్కిన ఫలితం.. కోట్లాది ప్రజల కోరికను గౌరవించిన కేంద్రం ఆంధ్రుల ఆత్మగౌరవ రాజధానిగా చరిత్ర-సంస్కృతికి ఆలవాలమైన అమరావతిని నిలిపింది. జై ఆంధ్రప్రదేశ్.. జయహో అమరావతి" అంటూ ట్వీట్ చేశారు.

## శ్రీరాముని ఆశీస్సులతో ధర్మపాలన



(మొదటి పేజీ తరువాయి)

**రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి :** 'మనందరికీ ఈ రోజు చాలా పవిత్రమైనది. సీతారాముల వారి కళ్యాణోత్సవంలో పాల్గొనడం మనందరి అదృష్టం. వేంకటేశ్వరస్వామి కూడా మన రాష్ట్రంలోనే కొలువై ఉండటం గొప్పవరం. రాష్ట్రం ఎప్పుడూ సుభిక్షంగా ఉండాలని, రాముడు రామరాజ్యాన్ని అందించినట్లుగానే కూటమి పాలన సాగేలా ఆశీర్వదించాలని ఆకాంక్షిస్తున్నా. ప్రజలకు సందప, ఆరోగ్యం, ఆనందం ఇవ్వాలని శ్రీరాముణ్ని ప్రార్థించా. సమైక్య రాష్ట్రంలో భద్రాచలంలో శ్రీరామనవమి జరుపుకునేవాళ్లం. విభజన తర్వాత ఒంటిమిట్టను టీటీడీలో విలీనం చేసి ఏటా ఘనంగా బ్రహ్మోత్సవాలు జరుపుకుంటున్నాం. ఈ రోజు లోక్‌సభలో అమరావతి రాజధానిగా ప్రవేశపెట్టిన బిల్లు ఆమోదం పొందింది. నాడు అమరావతి రాజధానిగా దేవేంద్రుడు పాలిస్తే... నేడు ప్రజారాజధానిగా అమరావతి ఉంది. రాముడు రామరాజ్యాన్ని ఇచ్చినట్లుగానే రాముడి ఆశీస్సులతో ధర్మాన్ని పాటించి మీకు అండగా ఉంటాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

## శాశ్వత రాజధానిగా అమరావతి

(మొదటి పేజీ తరువాయి)

29 వేలమంది రైతులు అమరావతి కోసం భూములు ఇచ్చారని.. రాజధాని నిర్మాణానికి ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారన్నారు ఎంపీ. వైసీపీ వచ్చాక అమరావతి భవితవ్యం అంధకారంలో పడిందని వ్యాఖ్యలు చేశారు. వైసీపీ హయాంలో ఏపీలో అరాచక పాలన సాగిందని విమర్శలు గుప్పించారు. వికేంద్రీకరణ పేరుతో రాష్ట్రాన్ని వైసీపీ నాశనం చేసిందన్నారు. అమరావతి కోసం రాజధాని రైతులు 1600 రోజులకు పైగా ఉద్యమించారని తెలిపారు. రాజధాని రైతులను అప్పటి ప్రభుత్వం నానా ఇబ్బందులు పెట్టిందని మండిపడ్డారు. రాజధాని నిర్మాణానికి కేంద్రం సహకరించలేదన్న కాంగ్రెస్ విమర్శలు సరికాదన్నారు. రాజధాని కోసం కేంద్ర ప్రభుత్వం హడ్కో నిధులు విడుదల చేసిందని ఎంపీ పురందేశ్వరి పేర్కొన్నారు.

## రాజధానిపై ఊసరవెల్లిలా రంగులు మార్చలేరు

(మొదటి పేజీ తరువాయి)

"ఈ బిల్లు అమరావతిని శాశ్వత రాజధానిగా చేస్తుంది. పక్క రాష్ట్రాల్లో సీఎంలు మారినా రాజధాని అభివృద్ధికి కృషి చేశారు. కానీ, జగన్ మూడు రాజధానులతో అమరావతిని విచ్ఛిన్నం చేసేందుకు యత్నించారు. ఇక, పులివెందుల ఎమ్మెల్యే రాజధానిపై ఊసరవెల్లిలా రంగులు మార్చలేరు. మూడు ముక్కలాట ఆడలేరు" అని సి.ఎం.రమేశ్ అన్నారు.

## వికేంద్రీకరణ పేరుతో వైసీపీ మూడు ముక్కలాట

(మొదటి పేజీ తరువాయి)

అమరావతి చట్టబద్ధత బిల్లుపై తనకు మాట్లాడే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. అమరావతిని రాష్ట్రానికి ఏకైక రాజధానిగా ఏర్పాటు చేయాలని పోరాడిన మహిళలకు జేజేలు పలికారు. రూపాయి ఖర్చు లేకుండా వేల ఎకరాలు అమరావతి కోసం సమీకరించిన వ్యక్తి చంద్రబాబు అని, ఆయనపై ప్రజలు పెట్టుకున్న నమ్మకమే అమరావతి అని పెమ్మసాని పేర్కొన్నారు. కానీ.. మధ్యలో వైసీపీ ప్రభుత్వం అభివృద్ధి వికేంద్రీకరణ పేరుతో మూడు ముక్కలాట ఆడిందని విమర్శించారు. అమరావతి నిర్మాణం చేయకుండా ఐదేళ్ల విలువైన కాలాన్ని వృథా చేసి, రైతులు మహిళలను అవమానించారన్నారు.

## అమరావతి బిల్లుతో రాష్ట్రానికి గర్వకారణ క్షణాలు



(మొదటి పేజీ తరువాయి)

పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో అమరావతి శాశ్వత రాజధానిగా స్థిరపడుతుందని తెలిపారు.

లోక్‌సభలో బిల్లుకు మద్దతు తెలిపిన అన్ని పక్షాలు, ఎంపీలకు కృతజ్ఞతలు తెలియజేశారు. అమరావతి చట్టబద్ధతను అంగీకరించలేక విమర్శలు చేస్తున్నవారికి ప్రజలు తగిన సమాధానం ఇస్తారని అన్నారు.

అమరావతికి మద్దతు అందిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాలకు ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అమరావతి ప్రజా రాజధానిగా, భావితరాల అభివృద్ధికి కేంద్రంగా నిలుస్తుందనే విశ్వాసం వ్యక్తం చేశారు.

## ఆనందోత్సాహాలతో ఆలపాటి ఎడ్ల బలప్రదర్శన పోటీలు

(మొదటి పేజీ తరువాయి)

దేవరపల్లి జాన్విక రెడ్డి, హన్సిక రెడ్డి (వేటపాలెం మండలం, బాపట్ల జిల్లా) జతకు మొదటి బహుమతిగా రూ. 50 వేల నగదు అందజేశారు. యద్దనపల్లి పెద్దబ్బాయి, మనోజ్ చౌదరి (రావిపాడు, నరసరావుపేట మండలం, పలనాడు జిల్లా) జతకు రెండో బహుమతిగా రూ. 40 వేల నగదు ప్రదానం చేశారు.

వెనిగళ్ళ కృష్ణవేణి యజ్ఞశ్రీ, షావలి అభిరామ్ (దోనేపూడి, కొల్లూరు మండలం, బాపట్ల జిల్లా - వేల్పూరు, అచ్చంపేట మండలం, పలనాడు జిల్లా) జతకు మూడో బహుమతిగా రూ. 35 వేల నగదు అందించారు. గొట్టిపాటి రవికుమార్ యాదవ్, చిలుకూరి నాగేశ్వరరావు (జె.పంగులూరు, బాపట్ల జిల్లా) జత నాలుగో బహుమతిగా రూ. 30 వేల నగదు గెలుచుకుంది. పమిడి అంజయ్య చౌదరి (ప్రత్తిపాడు, గుంటూరు జిల్లా) జతకు ఐదో బహుమతిగా రూ. 25 వేల నగదు అందజేశారు.







## సీఎం చంద్రబాబు కృషి వల్లే.. లోక్‌సభలో బిల్లు ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

అమరావతిపై పోరాడి విజయం సాధించిన రైతులకు అభినందనలు తెలిపారు.

ప్రజల రాజధాని అమరావతికి చట్టబద్ధత తెచ్చే కార్యాచరణలో, పార్లమెంట్ కు చేర్చిన,ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చరిత్ర పురుషుడిగా నిలిచిపోతారని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు.

రాజధాని కోసం చేసిన పోరాటం, అదో ప్రజా శాంతి విప్లవం అన్నారు.రాజధానికి చట్టబద్ధత తెచ్చిన చంద్రబాబు నాయుడుకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ప్రజల రాజధానిగా అమరావతిని నిలబెట్టుకునేందుకు,ఆప్రాంత రైతులు చేసిన పోరాటాలు, వారికి మద్దత్తుగానేటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన కృషి రాబోయే రోజుల్లో ప్రతి ఒక్కరు చరిత్రగా చెప్పుకుంటారని ఇదో శుభదినం అన్నారు

యావత్ తెలుగు జాతి చేసిన పోరాటాని కి దక్కిన గొప్ప గౌరవం ఇదని చెబుతు, ఉమ్మడి రాజధానిగా హైద్రాబాద్ గా ఉన్నా కూడా,ఆంధ్రప్రదేశ్ లో బస్ లో పాలన చేసిన పరిస్థితి మనం చూసామన్నారు. రాజధాని కోసం 29గ్రామాల్లో ఉన్న రైతాంగం మతం,కులం,ప్రాంతం తేడా లేకుండా ప్రజా రాజధాని కోసం భూములు త్యాగం చేశారని అన్నారు. ఎన్నికల ముందు అన్ని పార్టీలు



అమరావతి రాజధాని అని, 2019 తరువాత మూడు రాజధానుల పేరుతో మూడు ముక్కల ఆటకు తెరలేపి రాష్ట్రానికి రాజధాని లేకుండా, విధ్వంసాల పర్వాన్ని కొనసాగించిన ఘనత వైసీపీ పార్టీకే దక్కుతుందని,ఆ విపత్కర విధానాన్ని దృష్టిలో ఉంచుకుని, రాజధానిని ఎవ్వరు వచ్చిన మళ్ళీ కదిలించకూడదు అనే, మహాసంకల్పం,అసెంబ్లీలో తీర్మానించి పార్లమెంట్ కి పంపటం జరిగిందని, పార్లమెంట్ లో అన్ని పార్టీలు అమరావతి కి మద్దతు తెలిపితే ఒక్క వైసీపీ పార్టీ మాత్రం మద్దతు తెలపకపోవటం, వారి విధ్వంస విధానానికి పరాకాష్ట అన్నారు.నాడు అధికారంలో ఉండగా రాజధాని రైతులను, మహిళలను,అన్ని రకాలుగా హింసించి కేసులు పెట్టి లాఠీ చార్జ్ చేసి అవమానించిన ఘనత వైసీపీ పార్టీ విపరీత ధోరణికి నిదర్శనం అన్నారు.

వైసిపి నాయకులు అమరావతి పై ఇప్పటికీ కుట్రపూరిత నాటకాలు ఆడుతున్నారని అన్నారు.గతంలో ఎన్నో కుయుక్తులు పన్నారని, అయినా మన రాజధాని కోసం మన కన్న కలలను ఆపలేకపోయారన్నారు.రాజధాని కోసం పోరాడిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈసమావేశంలో జొన్నాదుల మహేష్, కేసన కోటేశ్వరరావు, చాట్రగడ్డ ఆంజనేయులు, గుమ్మడి ప్రసాద్, అఖిశెట్టి వెంకటేశ్వరరావు, బిబి అనిత, బోయపాటి అరుణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సేవలు ప్రజలకు సమర్థవంతంగా అందించాలి



- **జిల్లా కలెక్టర్ సాయి కాంత్ వర్మ వెల్లడి**

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** ప్రభుత్వ సేవలు ప్రజలకు సమర్థవంతంగా అందించాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ అన్నారు. నూతన జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా శాఖల అధికారులు ఆ శాఖకు బాస్ అన్నారు. శాఖకు సంబంధించిన ప్రతి అంశంపై పూర్తి స్థాయి అవగాహన ఉండాలన్నారు. శాఖలకు సంబంధించిన ఏ అంశం ఐనా ఆయా శాఖాధిపతుల ద్వారా మొట్టమొదటిగా సమాచారం అందాలని, ఇతర వర్గాల ద్వారా సమాచారం ముందుగా అందరాదని అన్నారు. ప్రాముఖ్యం ఉన్న జిల్లా అని, మంచి పనితీరు కనపరచాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ ప్రాధాన్యతలు గల అంశాలను ప్రజలకు సమర్థవంతంగా అందించాలని ఆదేశించారు.

**7న జిల్లా సమీక్షా సమావేశం :** 7న జిల్లా సమీక్షా సమావేశం జరుగుతుందని, అందుకు అవసరమైన పూర్తి సమాచారం పక్కాగా సమర్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్, గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి, రెవిన్యూ డివిజనల్ అధికారులు కె.శ్రీనివాస రావు, లక్ష్మి కుమారి, గుంటూరు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

## పెన్షన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే పుట్టా,

**బ్రహ్మంగారుమఠం (జర్నలిస్ట్ ఫైల్ ):** మైదుకూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ బుధవారం బి.మఠం మండలం రేకలకుంట పంచాయతీ పరిధిలోని డి. అగ్రహారం గ్రామంలో నిర్వహించిన పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరంగా తెలియజేసి ప్రతి అర్హుడికి న్యాయం జరిగేలా కృషి చేస్తున్నామని తెలిపారు. పెన్షన్ లబ్ధిదారులు ఎమ్మెల్యేకి తమ కృతజ్ఞతలు తెలియజేస్తూ కూటమి ప్రభుత్వం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ప్రతి నెలా సమయానికి పెన్షన్ అందించడం వల్ల తమ జీవనోపాధి మెరుగుపడిందని ప్రభుత్వం పేదల పట్ల చూపుతున్న శ్రద్ధ ప్రశంసనీయం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా టీడీపీ అధ్యక్షుడు భూపేష్ రెడ్డి ఉపాధ్యక్షుడు కానాల మల్లికార్జున రెడ్డి మనలాధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి మరియు టీడీపీ నాయకులు కార్యకర్తలు స్థానిక ప్రజాప్రతినిధులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

- **రైతులకు గిట్టుబాటు ధర అందేలా అన్ని చర్యలు తీసుకుంటాం**
- **ధరల తేడాపై కేంద్రంతో చర్చలు... రైతులకు నష్టం జరగనివ్వం**
- **రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** మొక్కజొన్న రైతులకు గిట్టుబాటు ధర అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. రైతులు నష్టపోకుండా ఉండేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. మొక్కజొన్న ధరల విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రాష్ట్ర ప్రభుత్వం రైతుల వెంటే నిలుస్తుందని అన్నారు. మొక్కజొన్న రైతుల సమస్యను సీఎం చంద్రబాబు కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారని, కేంద్రానికి లేఖ రాసి పరిస్థితిని వివరించారని తెలిపారు. రైతులకు భారం కాకుండా ఉండేలా కేంద్రం నుంచి అదనపు సహాయం, నిధులు తీసుకురావడానికి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందన్నారు. కేంద్రం కూడా రాష్ట్ర రైతుల సమస్యలను అర్థం చేసుకుని సహకరిస్తుందనే నమ్మకం తమకు ఉందన్నారు. అధిక వ్యయాలు, అంతర్జాతీయ పరిస్థితులు, ముఖ్యంగా గల్ఫ్ యుద్ధ ప్రభావం వంటి కారణాలతో మార్కెట్‌లో కొన్ని ఇబ్బందులు ఏర్పడుతున్నాయని చెప్పారు. అయినప్పటికీ రైతులకు నష్టం జరగకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటోందన్నారు. ఈ సమయంలో కొన్ని రాజకీయ పార్టీలు మార్కెట్లో ధరలు పూర్తిగా పడిపోయాయని ప్రచారం చేసి రైతుల్లో భయాందోళనలు సృష్టిస్తున్నాయని మండిపడ్డారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలు రైతులకు మరింత నష్టం కలిగించే ప్రమాదం ఉందన్నారు. గతంలో కూడా పలు పంటల విషయంలో మార్కెట్ ధరలు తగ్గినప్పుడు ప్రభుత్వం నేరుగా జోక్యం చేసుకుని రైతులను ఆదుకుందని మంత్రి గుర్తు చేశారు. ధాన్యం, మిర్చి, మామిడి, కోకో, పొగాకు, ఉల్లి, టమాటా,బొప్పాయి వంటి పంటల విషయంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నప్పుడు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వ కొనుగోళ్లు చేపట్టి రైతులకు భరోసా కల్పించిందన్నారు. అదే విధంగా ఇప్పుడు మొక్కజొన్న రైతుల విషయంలో కూడా ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరిస్తోందని స్పష్టం చేశారు. రైతులకు అవసరమైన విద్యుత్, సాగునీరు, నీటి భద్రత, పెట్టుబడి సహాయం వంటి అంశాల్లో ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. పీఎం కిసాన్, అన్నదాతా సుఖీభవ పథకాల కింద గత నెలలోనే మూడో విడత సాయం రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు.

## జగన్ మోహన్ రెడ్డి విధ్వంస ధోరణి వల్లనే...

- **అమరావతి చట్టబద్ధతకు దోహదం**
- **ఇది కూటమివిజయం**
- **మంత్రి నాదెండ్ల మనోహర్**




**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** ప్రజల రాజధాని అమరావతి విషయంలో ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా, విపరీత విధ్వంసం సృష్టించే జగన్ విధానం వల్లనే, రాజధానికి చట్టబద్ధత కల్పించే దుస్థితి రాష్ట్రానికి ఏర్పడిందని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.ప్రజల రాజధాని అమరావతి కి, చట్టబద్ధత కల్పించే కార్యాచరణలో భాగంగా, పార్లమెంట్ లో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా, బుధవారం గౌతమ్ కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతు రాష్ట్రం విడిపోయాక అధికారం చేపట్టిన తెలుగుదేశం ప్రభుత్వంలో, ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతి లో రాజధాని నిర్మాణానికి, ఎంతో కృషిచేసారని,ఆసమయంలో వచ్చిన,ఎన్నికల సమయంలా, అమరావతి విషయంలో,వైయస్ జగన్ ప్రజలను నమ్మబలికించి అధికారంలోకి వచ్చారని, మూడు ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టే విధంగా, మూడు రాజధానుల అంశాన్ని తీసుకువచ్చి, అమరావతిలో విధ్వంసం సృష్టించడం వల్లనే, ఈరోజు రాజధానికి చట్టబద్ధత కల్పించే దుస్థితి ఏర్పడిందన్నారు. పార్లమెంట్లో చట్టబద్ధత కల్పించే అంశంలో అందరూ సహకరించి ఉంటే హుందాగా ఉండేదని, అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్న జగన్ తీరుపై, అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్లమెంట్లో అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు ఎమైండ్ మెంట్ తేవడం పట్ల, ప్రధాని నరేంద్ర మోడీకి ధన్యవాదాలు తెలిపారు. మాజీ ముఖ్యమంత్రివైయస్ జగన్, ప్రజల రాజధాని అమరావతి విషయంలో, తమ పరిపాలనలో చేసిన, ఘోరాలను ప్రశ్నించామన్నారు. జనసేన పార్టీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విధానాలను సమర్థిస్తూ రాష్ట్ర అభివృద్ధి కోసం, అమరావతి అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో ముందుకు వెళుతుందని అన్నారు. వైయస్ జగన్ చేసే వ్యక్తిగత విమర్శల పట్ల మంత్రి మనోహర్ తీవ్రంగా స్పందించారు. రాష్ట్ర విభజన తర్వాత 10 ఏళ్లపాటు హైదరాబాద్ ఉమ్మడి రాజధాని అన్న విషయం గుర్తు చేశారు. తమకు బెంగళూరులో ప్యాలెస్ లు లేవన్నారు. ప్రజల నిర్ణయాలకు విరుద్ధంగా వ్యవహరించే జగన్మోహన్ రెడ్డి తీరును ప్రజలు విస్మరించరాదన్నారు.

# అమరావతికి అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు

(మొదటి పేజీ తరువాయి)

గత ఏడాది జూన్‌లో తల్లికి వందనం కింద ఆర్థిక సహకారం అందించామని.. ఈ ఏడాది జూన్ లోనూ తల్లుల ఖాతాల్లో నిధులు జమ చేస్తామని తెలిపారు. దీపం 2.0 కింద ఏడాదికి 3 ఉచిత సిలెండర్లను ఇస్తున్నామని త్వరలోనే ప్రతీ ఇంటికీ పైప్ ద్వారా గ్యాస్ అందించేందుకు చర్యలు చేపడుతున్నట్టు వివరించారు. దీని కోసం ఏడాదికి రూ. 2400 సబ్సీడిని కూడా వినియోగదారుల ఖాతాల్లో వేస్తామని తెలిపారు. పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం అడ్వాన్సుగా రూ. 1300 కోట్లను ఇచ్చిందని గోదావరి పుష్కరాల నాటికి ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తామన్నారు. పేదల జీవన ప్రమాణాలు పెంచేందుకు పీ4 కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామన్నారు. 25 వేల కుటుంబాల్ని దత్తత తీసుకునేందుకు అదానీ ట్రస్టు కూడా ముందుకు వచ్చిందని ముఖ్యమంత్రి వివరించారు.


**జువ్వలదిన్నె పై దుష్ప్రచారం :** ఉదయగిరి నియోజకవర్గం వింజమూరు పాతచెరువుకు సోమశిల కాలువ నుంచి నీటిని తరలించేందుకు రూ. 34 కోట్లతో పనులు చేపడతామని దీనిపై తక్షణం ఆదేశాలు జారీ చేస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఈ ఏడాది అక్టోబరు నాటికి చెరువును నింపుతామని భరోసా ఇచ్చారు. నీటి భద్రత కోసం స్థానిక వింజమూరు ప్రజలు వేసిన ఒక్క అడుగుకు ప్రజా ప్రభుత్వం వంద అడుగులు ముందుకు వేసి తోడుగా



నిలబడుతుందన్నారు. రూ. 70 లక్షల వ్యయంతో చెరువును పునరుద్ధరణకు తీసుకున్న చొరవను ముఖ్యమంత్రి అభినందించారు. నీటి సంరక్షణ కోసం ప్రజలు ఇదే స్ఫూర్తితో పనిచేయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. నెల్లూరు జిల్లాలో పెద్ద ఎత్తున పారిశ్రామిక అభివృద్ధి జరుగుతోందని.. రామాయపట్నం పోర్టు, దుగరాజపట్నం షిప్ బిల్డింగ్ సెంటర్ తో పాటు రక్షణ పరికరాలు, మానవ రహిత విమానాలు తయారవుతాయని .. ఇఫ్కో సెజ్ లో ఏర్పాటు కానున్న సౌర ఫలకాల తయారీ సహా వేర్వేరు పరిశ్రమల ద్వారా 80 వేల మందికి ఉద్యోగాలు వస్తాయన్నారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని 2018 లోనే కేంద్రానికి లేఖ రాసి ఫిషింగ్ హార్బర్ నిర్మాణం కోసం ప్రతిపాదనలు చేసినట్టు ముఖ్యమంత్రి వెల్లడించారు. రూ. 285 కోట్లతో దీని నిర్మాణం చేపట్టామని.. దీనిని వక్రీకరించి కొందరు హిట్ అండ్ రన్ నేరాల రాజకీయం చేస్తున్నారని సీఎం ఆక్షేపించారు. 2019-24 మధ్య జరిగిన అరాచక, విధ్వంస పాలన కొనసాగిందని అలాంటి వ్యక్తిని తన జీవితంలో చూడలేదని ముఖ్యమంత్రి అన్నారు. కూటమి పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు ఎవరూ మత్స్యకారులకు అన్యాయం చేసే పరిస్థితి ఉండదన్నారు. తమిళనాడు నుంచి వచ్చే మత్స్యకారులు ఎవరూ మన జలాల్లో చేపల వేట చేయకుండా నిఘా పెట్టాలని నెల్లూరు, తిరుపతి కలెక్టర్లను సీఎం వేదిక నుంచి ఆదేశించారు.

**నేతన్నలకు వెన్నుదన్నుగా ఉచిత విద్యుత్ :** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేరుస్తూ ఇవాల్టి నుంచి చేనేతలకు ఉచిత విద్యుత్ పథకాన్ని అమల్లోకి తీసుకువస్తున్నట్టు ముఖ్యమంత్రి ప్రకటించారు. 93 వేల చేనేత మగ్గాలకు 200 యూనిట్ల వరకూ, 11,488 పవర్ లూమ్ లకు 500 యూనిట్ల వరకూ ఉచితంగా విద్యుత్ అందిస్తామని తెలిపారు. దీని కోసం మొత్తం 153 కోట్లను వ్యయం చేస్తున్నామని.. ఉచిత విద్యుత్ పథకం వల్ల ఒక్కో చేనేత కుటుంబానికి వేల రూపాయల మేర ఆదా అవుతుందన్నారు. నేతన్న సంక్షేమానికి.. వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి వివరించారు. చేనేతల సంక్షేమం కోసం రూ. 5 కోట్లతో త్రిఫ్ట్ ఫండ్ ఏర్పాటు చేశామని.. 55 ఏళ్లకే పెన్షన్ కూడా అందిస్తున్నట్టు తెలిపారు. నేషనల్ రూరల్ లైవ్లీ హుడ్ పథకం కింద 5 చోట్ల హ్యాండ్లూమ్ క్లస్టర్లను ప్రారంభించబోతున్నట్టు సీఎం ప్రకటించారు. అనంతరం లబ్దిదారులకు ఉచిత విద్యుత్ సరఫరా ధృవపత్రాలను అందించారు. 21 నెలల్లో 5.5 లక్షల గృహప్రవేశాలు చేయించామని.. డిసెంబరు లోగా 4.5 లక్షల ఇళ్లలో ప్రవేశించేలా నిర్మాణాలు పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి వివరించారు. ప్రజలందరికీ పౌరసేవలు మెరుగ్గా అందించటంతో పాటు వాటిపై ప్రజాభిప్రాయాన్ని కూడా సేకరిస్తున్నామని తెలిపారు. పౌరసేవలు సరిగా అందకపోయినా.. మౌలిక సదుపాయాలు కల్పించకపోయినా ఆకస్మిక తనిఖీలు చేసి కఠినంగా వ్యవహరిస్తానని సీఎం స్పష్టం చేశారు. సుపరిపాలనా మహాయజ్ఞానికి ఎవరు నష్టం కలిగించినా సహించబోనని ముఖ్యమంత్రి హెచ్చరించారు. ప్రజావేదిక సమీపంలో సూక్ష్మసేద్యం సహా డ్రోన్ సహకారంతో సేద్యానికి సంబంధించిన స్టాళ్లను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జి మంత్రి ఫరూఖ్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, బీదమస్తాన్ రావు, ఉదయగిరి శాసనసభ్యుడు కాకర్ల సురేశ్, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా తదితరులు హాజరయ్యారు.

# ఎన్నికల్లో చేనేతలకు ఇచ్చిన ఉచిత విద్యుత్ హామీని అమల్లోకి తెచ్చాం



ఇది నేతన్న కష్టానికి ఇస్తున్న గౌరవం... వారి వృత్తికి కలిగిస్తోన్న భరోసా: ఎక్స్‌లో సీఎం చంద్రబాబులి

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను హామీగా కాకుండా బాధ్యతగా తీసుకున్న ప్రజా ప్రభుత్వం... నేడు చేనేత సోదరుల జీవితాల్లో వెలుగులు నింపింది. మగ్గం ఆడితేనే ఇంట్లో దీపం వెలిగే నేతన్నల కష్టాన్ని అర్థం చేసుకుని ఉచిత విద్యుత్ పథకానికి శ్రీకారం చుట్టాం. 93 వేల చేనేత మగ్గాలకు నెలకు 200 యూనిట్లు, 11,488 మరమగ్గాలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ ఈరోజు నుంచే అమల్లోకి వస్తోంది. విద్యుత్‌ను రాయితీగానే కాదు...ఒక్కో నేతన్న కష్టానికి ఇస్తున్న గౌరవం... వారి వృత్తికి కలిగిస్తున్న భరోసా. ఏడాదికి రూ. 150 కోట్లు ఖర్చవుతున్నా... అంతకంటే ప్రభుత్వానికి ముఖ్యమైనది నేతన్నల చిరునవ్వు. ఉచిత విద్యుత్ పథకం ద్వారా ఒక్కో కుటుంబానికి సంవత్సరానికి రూ. 8 వేల నుంచి రూ. 21 వేల దాకా ఆదా కలిగించడంతో పాటు వారి జీవన స్థాయిని మెరుగుపరచేందుకు వేసిన పెద్ద అడుగు. చేనేత వస్త్రాలను గ్లోబల్ స్థాయికి తీసుకెళ్లేలా బ్రాండ్ కల్పిస్తూ అమ్మకాలను ప్రోత్సహిస్తున్నాం. మగ్గం దగ్గర కూర్చుని జీవితాన్ని నెట్టుకొస్తున్న ప్రతీ నేతన్నకు ప్రభుత్వం చెబుతున్న మాట... మీరు నేస్తున్నది కేవలం వస్త్రం కాదు... మన సంస్కృతి. చేనేత కుటుంబాల అభ్యున్నతే లక్ష్యంగా... వారి కష్టానికి తోడుగా నిలబడేందుకు ప్రజా ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుంది.

# ఆంధ్రుల కలలు అమరావతి రాజధానితో నెరవేరుంది



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రుల కలల రాజధాని అమరావతి అని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. అమరావతికి చట్టబద్ధత బిల్లును కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో ప్రవేశపెట్టిన అనంతరం స్పీకర్ ఓం బిర్లా చర్చకు అనుమతించారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడారు.

"రాజధాని అమరావతి బిడ్డగా ఈ సభలో ప్రసంగించడం నా అదృష్టం. అమరావతి కోసం భూములు త్యాగం చేసిన రైతులకు అభినందనలు. ఏకైక రాజధానిగా అమరావతిని ఏర్పాటుచేయాలి. రాజధాని ఉద్యమంలో పోరాడిన మహిళలకు జేజేలు. రూపాయి ఖర్చు లేకుండా వేల ఎకరాల భూమిని సమీకరించిన వ్యక్తి సీఎం చంద్రబాబు. ఆయనపై ప్రజలు పెట్టుకున్న నమ్మకమే అమరావతి. వికేంద్రీకరణ పేరుతో అప్పటి సీఎం జగన్ మూడు ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టారు. 29 వేల మంది రైతులకు జరిగిన అన్యాయం, అవమానంపై చర్చించాలి. 'న్యాయస్థానం నుంచి దేవస్థానం వరకు' పేరుతో రాజధాని ప్రాంత మహిళలు యాత్ర చేపడితే వేధించారు. మహిళా రైతులను మేకులు ఏర్పాటుచేసిన లాఠీలతో జగన్ కొట్టించారు. వారి కన్నీళ్లే ఈ చట్టానికి పునాదిగా మారాయి. జగన్ అవివేక వల్లే అమరావతి ఒక ఉద్యమంలా మారి దేశాన్ని ఆకర్షించింది.

రాష్ట్రాభివృద్ధిలో రాజధాని కీలక పాత్ర పోషిస్తుంది. బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ నగరాలు ఆయా రాష్ట్రాల అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. ఏపీ ఆర్థిక అభివృద్ధిలో అమరావతి కీలకంగా మారాలి. రాష్ట్ర రాజధాని నిర్ణయం, మార్పు కేంద్రం పరిధిలో ఉంటుందని 2022లో సుప్రీంకోర్టు చెప్పింది. రాష్ట్రంలో రాజకీయ అస్థిరత్వం ఉంటే పెట్టుబడులు రావు. ఏపీ రాజధానిగా అమరావతి శాశ్వతంగా ఉంటుందా? అన్న అనుమానానికి ఈ చట్టసవరణ ముగింపు పలుకుతుంది. అమరావతి నిర్మాణం చంద్రబాబు ఆశయం. కూటమి ఐక్యతకు కంకణబద్ధుడైన వ్యక్తి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్. రాజధానికి చట్టబద్ధత ఇచ్చేందుకు అంగీకరించిన ప్రధాని మోదీకి కృతజ్ఞతలు" అని పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు.

# స్వర్ణాంధ్ర నిర్మాణంలో కీలక మైలురాయి..



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** అమరావతి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఏకగ్రీవంగా ఆమోదం తెలపడంపై రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఇదొక చారిత్రాత్మక రోజని ఆయన అభివర్ణించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు, మంత్రి లోకేష్ కు మరియు రాజధాని కోసం ఐదేళ్లుగా అలుపెరగని పోరాటం చేసిన అమరావతి రైతులకు ఆయన పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.


**చట్టబద్ధతతో ఇక అమరావతి శాశ్వతంలి** రాష్ట్రాభివృద్ధిలో రాజధాని పాత్ర కీలకమని భావించి, రాష్ట్ర భవిష్యత్తు కోసం అమరావతిని ఏకైక రాజధానిగా ఇటీవల ప్రత్యేకంగా అసెంబ్లీ సమావేశం నిర్వహించి తీర్మానం చేశామని మంత్రి దుర్గేష్ గుర్తుచేశారు. దీనికి చట్టబద్ధత కల్పించేలా విభజన చట్టంలోని సెక్షన్ 5(2)కు సవరణ బిల్లును కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ లోక్‌సభలో ప్రవేశపెట్టగా సభ ఏకగ్రీవంగా ఆమోదించిందని తెలిపారు. త్వరలోనే దీనికి సంబంధించి కేంద్ర గెజిట్ వెలువడనుందని, 2024 జూన్ 2 నుంచి అమరావతి ఏపీ రాజధానిగా అమల్లోకి రానుందని ఆయన వివరించారు. ఈ బిల్లుతో అమరావతిని ఇక ఎవరూ అంగుళం కూడా కదల్చలేరని స్పష్టం చేశారు.

**వైసీపీ తీరుపై ఆగ్రహం:** అమరావతి చట్టబద్ధత బిల్లును లోక్ సభలో వైసీపీ వ్యతిరేకించడంపై మంత్రి దుర్గేష్ మండిపడ్డారు. "నాడు ప్రతిపక్ష నేతగా అమరావతికి మద్దతు తెలిపిన జగన్ మోహన్ రెడ్డి, అధికారంలోకి వచ్చాక మూడు ముక్కలాట ఆడి రాజధాని భవిష్యత్తును అంధకారంలోకి నెట్టారు. అందుకే ప్రజలు వారిని ఛీత్కరించారు" అని విమర్శించారు. నేడు లోక్‌సభలో బిల్లును వ్యతిరేకించి వాకౌట్ చేయడం వైసీపీ అహంకారానికి నిదర్శనమని, ఇది సిగ్గుచేటని ఆయన ధ్వజమెత్తారు.

**రైతులు, మహిళల త్యాగాలకు దక్కిన గౌరవంలి:** రాజధాని కోసం భూములిచ్చిన రైతులు, పోరాటం చేసిన మహిళల త్యాగాలకు ఈ ఆమోదం ఊపిరి పోసిందని మంత్రి దుర్గేష్ అన్నారు. కూటమి ప్రభుత్వం అమరావతిని వరల్డ్ క్లాస్ రాజధానిగా తీర్చిదిద్దడమే కాకుండా, అన్ని ప్రాంతాల అభివృద్ధికి కట్టుబడి ఉందని ఉద్ఘాటించారు. రేపు రాజ్యసభలో కూడా ఈ బిల్లు ఆమోదం పొందుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికే సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అమరావతిని ఒక అంతర్జాతీయ స్థాయి నగరంగా తీర్చిదిద్దేలా ప్రణాళికలు సిద్ధం చేసి ఆ దిశగా శరవేగంగా పనులు చేస్తుందన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా రాజధానులు మారకూడదనే ఉద్దేశంతో అమరావతికి శాశ్వత చట్టబద్ధత కల్పించడంలో సీఎం చంద్రబాబు నాయుడు దృఢ సంకల్పం విజయం సాధించిందన్నారు.

# అభివృద్ధి పథంలో నిడదవోలు ..సూపర్ సిక్స్ హామీల అమలుతో ప్రజల చెంతకే పాలన

**నిడదవోలు (జర్నలిస్ట్ ఫైల్) :** ఎన్నికల సమయంలో పేద ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం 'సూపర్ సిక్స్' హామీలను అత్యంత పారదర్శకంగా అమలు చేస్తోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. బుధవారం నిడదవోలు నియోజకవర్గం ఉండ్రాజవరం మండలం మోర్త గ్రామంలో మంత్రి దుర్గేష్ పర్యటించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను లబ్ధిదారుల ఇంటికే వెళ్లి స్వయంగా పంపిణీ చేశారు. వృద్ధులు, దివ్యాంగులను ఆత్మీయంగా పలకరించి, వారి ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. అనంతరం పలువురు చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు.



**తల్లికి వందనం - అన్నదాత సుఖీభవపై హర్షం:** ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వానికి, ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి ఉన్న తేడాను ప్రజలు గమనించాలని కోరారు. గతంలో 'అమ్మఒడి' పేరుతో కుటుంబంలో ఎంత మంది చదువుకుంటే అంతమందికి డబ్బులు ఇస్తామని చెప్పి కేవలం ఒక్కరికి మాత్రమే ఇచ్చి హామీని తుంగలో తొక్కారని ఫైర్ అయ్యారు. కానీ నేడు కూటమి ప్రభుత్వంలో 'తల్లికి వందనం' పథకం ద్వారా ఇంట్లో ఎంతమంది చదువుకుంటుంటే అంతమందికి ఏటా రూ. 15,000 చొప్పున ఆర్థికసాయం అందిస్తున్నామని తెలిపారు. తల్లికి వందనం కార్యక్రమంపై రాష్ట్రమంతటా హర్షం వ్యక్తం అవుతోందన్నారు. అలాగే 'అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్' కింద కేంద్ర ప్రభుత్వ వాటా రూ. 6000, రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ. 14000 తో కలిపి రైతులకు ఏటా 3 విడతల్లో రూ. 20,000 ఆర్థిక సాయం అందిస్తూ రైతన్నకు భరోసా ఇస్తున్నామన్నారు. గత ప్రభుత్వం రైతు భరోసా పేరుతో రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ. 12,500, కేంద్ర వాటాగా 6000 ఇస్తామని చెప్పి కేవలం 7,500 మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుందని మండిపడ్డారు. మొత్తంగా కేంద్ర వాటాతో కలిపి రూ. 13,500 ఇచ్చి చేతులు దులుపుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేగాదు కుల మతాలకతీతంగా అన్ని వర్గాల రైతులకు అన్నదాత సుఖీభవ అందిస్తున్నామన్నారు. కానీ గత ప్రభుత్వం ఆరుగాలం శ్రమించే రైతన్నకు కూడా కులాలను ఆపాదించి దగా చేసిందన్నారు.

**మహిళా సాధికారత మరియు సంక్షేమం:** స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు, ట్రాన్స్‌జెండర్లకు మరియు దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని మంత్రి దుర్గేష్ గుర్తుచేశారు. దివ్యాంగ శక్తి ద్వారా దివ్యాంగులకు తోడుగా వెళ్లే సహాయకులకు సైతం 50 శాతం రాయితీ కల్పిస్తూ మానవీయ కోణంలో నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు. అదే విధంగా ఏటా 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేస్తున్నామన్నారు. మెగా డీఎస్సీ ద్వారా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలను కల్పించామని పేర్కొన్నారు.

**చేనేతలకు ఉచిత విద్యుత్:** ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా కూటమి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేడు రాష్ట్రవ్యాప్తంగా చేనేతలకు ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రారంభించారని మంత్రి దుర్గేష్ తెలిపారు. నేతన్నలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ నిలబెట్టుకుంటూ ఈ పథకం ద్వారా ఏపీ రాష్ట్రవ్యాప్తంగా 93,000 చేనేత మగ్గాలకు నెలకు 200 యూనిట్లు, 11,488 పవర్ లూమ్‌లకు నెలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందుతుందని, దీని కోసం ప్రభుత్వం ఏటా రూ. 150 కోట్లు వెచ్చిస్తోందని పేర్కొన్నారు. నేతన్నల సంక్షేమానికి, చేనేత వస్త్రాల అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలన్నారు.

**నిడదవోలు నియోజకవర్గ అభివృద్ధి:** గడిచిన 22 నెలల్లో మోర్త గ్రామంలోనే రూ. 4.25 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టామని మంత్రి దుర్గేష్ వెల్లడించారు. పల్లెపండుగ 1.0 ద్వారా రూ. 36 లక్షలతో రహదారి, డ్రైన్ నిర్మాణ పనులు చేపట్టామన్నారు. ఇప్పటికే 6 పనులు పూర్తయ్యాయన్నారు. పల్లె పండుగ 2.0 ద్వారా రూ. 52 లక్షలతో 5 పనులు ప్రారంభించనున్నామన్నారు. జల్ జీవన్ మిషన్ ద్వారా రూ. 233.60 లక్షలతో ప్రతి ఇంటికి మంచి నీరు అందించాలనే లక్ష్యం దిశగా వెళ్తున్నామన్నారు. గత ప్రభుత్వం జల్ జీవన్ మిషన్ నిధులను పక్కదారి పట్టించిందని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో ఏషియన్ బ్యాంకు, కేంద్ర ప్రభుత్వంలో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లు మాట్లాడి ఈ ప్రాజెక్టును మంజూరు చేయించారని గుర్తుచేశారు. త్వరలోనే నిడదవోలు నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు మంచినీరు అందిస్తామన్నారు. గతేడాది డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఈ కార్యక్రమానికి పెరవలిలో శంకుస్థాపన చేశారని గుర్తుచేశారు. ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు మండల ప్రజా పరిషత్ నిధుల నుండి రూ. 5 లక్షలు, పంచాయతీ నిధుల నుండి రూ. 5 లక్షలు వెచ్చించామన్నారు. ఉండ్రాజవరం మండలంలో 12 గోకులం షెడ్లకు రూ. 23.20 లక్షలు మంజూరు చేశామన్నారు. సీఎం చంద్రబాబునాయుడు, ఆర్ అండ్ బీ మంత్రితో చర్చించి కానూరు నుండి ఉండ్రాజవరం రోడ్డులో భాగంగా మోర్తలో రూ. 60 లక్షలు సీసీ రోడ్లకు మంజూరు చేయించామన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పెంచి అందిస్తున్నామన్న మంత్రి దుర్గేష్ కేవలం మోర్త గ్రామంలోనే రూ. 42.48 లక్షల విలువైన 977 పెన్షన్లు అందించామన్నారు. కొత్తగా స్పౌజ్ పెన్షన్లను కూడా అందించామని తెలిపారు. త్వరలోనే అర్హులైన వారికి కొత్తగా పెన్షన్లు అందిస్తామని భరోసానిచ్చారు.

**సర్వతోముఖంగా నిడదవోలు అభివృద్ధి :** నిడదవోలును సర్వతోముఖంగా అభివృద్ధి చేస్తున్నామని మంత్రి దుర్గేష్ అన్నారు. నియోజకవర్గంలో ఆర్ అండ్ బీ రోడ్లు పూర్తిస్థాయిలో బాగు చేస్తామన్నారు. డ్రైన్ల నిర్మాణాలకు, పుంత రోడ్ల అభివృద్ధికి చర్యలు ప్రారంభించామని ఇప్పటికే వివిధ రూపాల్లో నిధులు సమీకరిస్తున్నామన్నారు. నిడదవోలు ఆస్పత్రిని 100 పడకల ఆస్పత్రిగా అప్ గ్రేడ్ చేయడం, కొత్త పెన్షన్లు మంజూరు చేయడం, పీహెచ్ సీల ఆధునికీకరణ తదితర కార్యక్రమాలన్నీ త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. సీఎం, డిప్యూటీ సీఎంలతో మాట్లాడి నిడదవోలుకు ప్రత్యేకంగా భారీ స్థాయిలో నిధులు రాబట్టి మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామన్నారు. ఇప్పటికే పంచాయతీ రాజ్ శాఖ ద్వారా వచ్చే శాస్కి నిధులు ప్రతి నియోజకవర్గానికి రూ. 6-7 కోట్లు ఇస్తే తాను ప్రత్యేకంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తో మాట్లాడి రూ. 28 కోట్లు మంజూరు చేయించానన్నారు. టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, త్వరలోనే పూర్తిస్థాయిలో పనులు పట్టాలెక్కుతాయన్నారు. తాను ఎమ్మెల్యే, మంత్రిగా కంటే ప్రజలకు ప్రజాసేవకుడిగా ఉండటానికే ఇష్టపడతానన్నారు. అభివృద్ధికి సహకరిస్తున్న కూటమి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇతర ప్రాంతాలతో పోలిస్తే రోడ్ల నిర్మాణంలో నిడదవోలు ముందంజలో ఉందన్నారు.

**అమరావతి ఏకైక రాజధాని..రాష్ట్రమంటే పట్టని ప్రతిపక్షం:** రాష్ట్ర భవిష్యత్తు కోసం అమరావతిని ఏకైక రాజధానిగా అసెంబ్లీలో తీర్మానం చేశామని, దీనికి చట్టబద్ధత కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం విభజన చట్టంలోని సెక్షన్ 5(2)కు సవరణ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టనుందని మంత్రి దుర్గేష్ తెలిపారు. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా నేతృత్వంలో ఈ బిల్లును కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ లోక్ సభలో ప్రవేశపెట్టనున్నారని వివరించారు. త్వరలోనే అమరావతి ఏకైక రాజధానిగా గెజిట్ వెలువడనుందని, ఇది ఏపీ ప్రజలందరి విజయమని ఆయన ఉద్ఘాటించారు. రైతులు, మహిళల త్యాగాలకు ఈ తీర్మానం నిదర్శనమన్నారు. అమరావతి తీర్మానానికి వైసీపీ నేతలు మద్దతు తెలపడానికి ముందుకు రావడం లేదని వారికి అమరావతి అంటే ఇష్టం లేనట్లుగా ప్రవరిస్తున్నారన్నారు. నాడు ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు అమరావతి రాజధానికి సంపూర్ణ మద్దతు ఇచ్చిన జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక రాజధాని విషయంలో మూడు ముక్కలాట ఆడారని ఫైర్ అయ్యారు. ఈ నేపథ్యంలోనే ప్రజలు వారిని ఛీ కొట్టారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ప్రజానీకం కోరినట్లుగా గెజిట్ లో అమరావతి ఏకైక రాజధానిగా ఉంటుందని ప్రజల్లో ఉత్సాహం నింపారు.

గ్రేట్ విజనరీగా పేరొందిన సీఎం చంద్రబాబునాయుడు, పేదవాడి కంట చిరునవ్వు చూడటమే లక్ష్యంగా పెట్టుకొని పార్టీని స్థాపించిన జనసేనాని, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, దేశంలోనే ఉక్కు మనిషిగా పేరొందిన ప్రధాని మోదీల కలయికలో రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ పరుగులుపెడుతూ సాహసోపేత నిర్ణయాలు తీసుకొని అమలు చేస్తుందని ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. వారందరి సపోర్ట్, ప్రజల ఆశీస్సులతో మంత్రిని అయ్యాయని ప్రజల బాగు కోసమే తాను శ్రమిస్తానని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# అమరావతికి చట్టబద్ధతతో చరిత్రాత్మక విజయం



**వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్ ):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అమరావతిని ఏకైక రాజధానిగా చట్టబద్ధత కల్పించడం ఒక మహత్తర చారిత్రాత్మక నిర్ణయమని ప్రభుత్వ చీఫ్ విప్ జి.వి. ఆంజనేయులు తెలిపారు. ఈ నిర్ణయం కేవలం పరిపాలనా పరమైనది మాత్రమే కాకుండా, రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు, ముఖ్యంగా రైతుల త్యాగానికి లభించిన గౌరవప్రదమైన గుర్తింపని ఆయన స్పష్టం చేశారు.

అమరావతి నిర్మాణానికి దృఢమైన మద్దతు అందించిన ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్ర అభివృద్ధికి అంకితభావంతో కృషి చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ప్రజల సంకల్పానికి ప్రతినిధిగా నిలుస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి జి.వి. ఆంజనేయులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

అమరావతి ఒక రాజధాని నగరం మాత్రమే కాకుండా, భారతీయ సంస్కృతి, చరిత్ర, నాగరికతకు ప్రతీకగా నిలిచే మహానగరంగా రూపుదిద్దుకుంటుందని ఆయన అన్నారు. 29 గ్రామాలకు చెందిన రైతులు స్వచ్ఛందంగా వేల ఎకరాల భూమిని సమర్పించడం ప్రపంచంలోనే అరుదైన ఉదాహరణగా నిలిచిందని కొనియాడారు. రైతుల త్యాగం, మహిళల దీక్ష, ప్రజల నమ్మకం---ఈ మూడు అమరావతి నిర్మాణానికి అజేయమైన పునాదులుగా నిలిచాయని ఆయన వివరించారు.

గతంలో స్వార్థ రాజకీయాల కోసం రాజధాని అంశాన్ని వివాదాస్పదం చేసి రాష్ట్ర అభివృద్ధిని తీవ్రంగా దెబ్బతీశారని ఆయన విమర్శించారు. రైతుల ఆవేదనను పట్టించుకోకపోవడం, ప్రజా ఉద్యమాలను అణచివేయడం వంటి చర్యలు చరిత్రలో మచ్చలుగా మిగిలాయని అన్నారు. 1631 రోజుల పాటు సాగిన రైతుల పోరాటం ఒక సాధారణ ఉద్యమం కాదు, అది ఆత్మగౌరవం కోసం జరిగిన చరిత్రాత్మక సమరం అని అభివర్ణించారు.

రాజధాని నిర్మాణం తాత్కాలిక రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా, రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని చేపట్టాల్సిన అత్యంత కీలక బాధ్యత అని జి.వి. ఆంజనేయులు పేర్కొన్నారు. అమరావతి త్వరలోనే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ప్రధాన కేంద్రంగా మారబోతోందని, వేల కోట్ల రూపాయలతో కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులు వేగంగా అమలు అవుతున్నాయని తెలిపారు.

పెట్టుబడిదారుల విశ్వాసాన్ని గెలుచుకోవాలంటే స్పష్టమైన విధానాలు, స్థిరమైన పాలన అవసరమని, ఆ లక్షణాలన్నీ అమరావతి ద్వారా ప్రతిఫలిస్తాయని అన్నారు. ఈ మహత్తర యజ్ఞానికి కేంద్రం, రాష్ట్రం కలసి ముందుకు సాగుతున్నాయని, ముఖ్యంగా ప్రధాని మోదీ ప్రోత్సాహం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూరదృష్టి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిబద్ధత అమరావతి అభివృద్ధికి బలమైన ఆధారాలుగా నిలుస్తున్నాయని తెలిపారు. అలాగే యువనేత నారా లోకేష్ కృషిని ప్రశంసించారు.

అమరావతి నిర్మాణం రైతుల త్యాగానికి సముచిత గౌరవం మాత్రమే కాకుండా, తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి చిరస్థాయిగా నిలిచే చిహ్నమని ఆయన పేర్కొన్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగంతో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినట్లే, ఇప్పుడు రైతుల త్యాగంతో మహా రాజధాని రూపుదిద్దుకుంటోందని ఆయన గర్వంగా చెప్పారు. ఎలాంటి సవాళ్లు ఎదురైనా, తిరిగి ఎదగగల శక్తి తెలుగు ప్రజలకు ఉందని విశ్వాసం వ్యక్తం చేశారు. పార్లమెంట్ సాక్షిగా అమరావతికి చట్టబద్ధత లభించడం రాష్ట్ర చరిత్రలో స్వర్ణాక్షరాలతో నిలిచిపోతుందని, ఇది ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుకు దృఢమైన మార్గదర్శకంగా నిలుస్తుందని ప్రభుత్వ చీఫ్ విప్ జి.వి. ఆంజనేయులు స్పష్టం చేశారు.

# పీఆర్‌సీ ఛైర్మన్‌ను వెంటనే నియమించాలి: ఆప్టా డిమాండ్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న వేతన సవరణ కమిటీ (పీఆర్‌సీ) ఛైర్మన్‌ను తక్షణమే నియమించి, వేతన సవరణ ప్రక్రియను పూర్తి చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) డిమాండ్ చేసింది.

ఈ మేరకు ఆప్టా రాష్ట్ర అధ్యక్షుడు కాకి ప్రకాష్ రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. జి. మెహది, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి నారాయణరావు, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఏ. జి. ఎస్. గణపతి రావు సంయుక్త ప్రకటన విడుదల చేశారు. వేతన సవరణ ప్రక్రియ ఇప్పటికే రెండున్నర సంవత్సరాలకు పైగా ఆలస్యమైందని వారు పేర్కొన్నారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు ఏడాది కాలంగా రిటైర్మెంట్ ప్రయోజనాలు అందకపోవడం వల్ల తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను అత్యవసరంగా పరిగణించి, పెండింగ్ బకాయిలను ప్రాధాన్యత క్రమంలో వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు.

సీపీఎస్, జీపీఎస్ పథకాలను రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను పునరుద్ధరించాలని, 12వ పీఆర్‌సీ కమిషన్‌ను నియమించి కనీసం 30 శాతం ఫిట్‌మెంట్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే 11వ పీఆర్‌సీ ఏరియర్స్, డీఏ బకాయిలను వెంటనే చెల్లించడంతో పాటు 2022 నుంచి పెండింగ్‌లో ఉన్న ఈఎల్స్ బకాయిలను విడుదల చేయాలని కోరారు. పెన్షన్ సంబంధిత సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, ఎంటీఎస్ ఉపాధ్యాయుల పదవీ విరమణ వయస్సును రెండు సంవత్సరాలు పెంచాలని సూచించారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి వారికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

ప్రభుత్వం ఈ డిమాండ్లను తక్షణమే పరిగణనలోకి తీసుకుని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని ఆప్టా నేతలు విజ్ఞప్తి చేశారు.

# రాజధాని అమరావతికి చట్టబద్ధత... జగన్ వెన్నులో వణుకు

- **తాడేపల్లి ప్యాలెస్‌లో మద్దతన్న జగన్-లోక్ సభలో వ్యతిరేకించిన వైసిపి సభ్యులు**
- **అమరావతి రాజధానితో ప్రజల కలల సాకారానికి కృషి చేస్తున్న సిఎం చంద్రబాబు**
- **కమీషన్ల జాడల కోసం ఆరాటపడుతున్న మాజీ సిఎం జగన్‌రెడ్డి**
- **మూడు ముక్కలాటతో వైజాగ్‌లో రూ.500 కోట్ల ప్యాలెస్‌తో ప్రజల్ని వంచించిన జగన్**
- **రాయలసీమకు ఐదేళ్లపాటు తీరని ద్రోహం**
- **రాజధాని అమరావతిపై జగన్ వ్యాఖ్యల పట్ల ధ్వజమెత్తిన**
- **ధ్వజమెత్తిన మంత్రి సత్యకుమార్ యాదవ్**



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** తన దుష్ట, విధ్వంసకర ఆలోచనలకు విరుద్ధంగా రాజధాని అమరావతికి పార్లమెంటు ద్వారా చట్టబద్ధత లభిస్తున్న తరుణంలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి వెన్నులో వణుకు పుట్టిందని, దీంతో నిరాశానిస్పృహలకు లోనై రాజధానిపైన, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపైనా అవాకులు చవాకులు, అసంబద్ధ వ్యాఖ్యలు చేసి జగన్‌రెడ్డి తన రాజకీయ దిగజారుడుతనాన్ని వెల్లడించుకున్నారని వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ధ్వజమెత్తారు. బుధవారంనాడు ఎంపిక చేసుకున్న పాత్రికేయులతో కూడిన పత్రికా సమావేశంలో ఈ అంశంపై జగన్ వ్యాఖ్యలను మంత్రి నేడొక ప్రకటనలో తీవ్రంగా దుయ్యబట్టారు.

రాజధాని అమరావతి చట్టబద్ధత దిశగా రాష్ట్ర శాసన సభ తీర్మానం చేసిన అనతి కాలంలోనే కేంద్రంలోని కూటమి ప్రభుత్వం ఈ దిశగా లోక్ సభలో బుధవారంనాడు బిల్లును ఆమోదింపజేసినందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్‌షాకు మంత్రి సత్యకుమార్ యాదవ్ ధన్యవాదాలు తెలిపారు. ఈ బిల్లుకు మద్దతు తెలిపిన పలు పార్టీలకు కూడా మంత్రి ధన్యవాదాలు తెలిపారు.

**వెల్లడైన జగన్ మోసం :** బుధవారంనాటి పత్రికా సమావేశంలో అమరావతి రాజధానికి తాను వ్యతిరేకిని కాదని తాడేపల్లి ప్యాలెస్‌లో జగన్‌రెడ్డి వెల్లడించిన కొద్ది గంటల్లోనే లోక్ సభలో వైసిపి సభ్యులు బిల్లుకు వ్యతిరేకంగా వాకవుట్ చేయడం జగన్‌రెడ్డి మోసపూరిత వైఖరిని వెల్లడించిందని మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ ఎత్తిచూపారు. ఆదినుంచి జగన్‌రెడ్డి ఈ మోసపూరిత వైఖరిని పాటించినందునే గత ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు వైసిపికి పాతర వేశారని, అయినా ఆయనలో కనువిప్పు కలగలేదని మంత్రి అన్నారు. గతంలో రాష్ట్ర శాసన సభ సాక్షిగా కనీసం 33,000 ఎకరాల్లో అమరావతిలో రాజధానిని నిర్మించాలని సూచించిన జగన్‌రెడ్డి అనంతరం విశాఖపట్నంలోని విలువైన వేలాది ఎకరాల భూములను బినామీలపరం చేసి మూడు ముక్కలాటకు తెరతీసి కేవలం తన కుటుంబం కోసం విశాఖపట్నంలో రూ. 500 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన జగన్ రెడ్డి ప్రస్తుతం శర వేగంగా జరుగుతున్న అమరావతి నిర్మాణ పనుల్లో లొసుగులు వెతకడం ఆయనలో పాతుకుపోయిన పచ్చకామెర్ల వ్యాధికి ప్రత్యక్ష తార్కాణమని మంత్రి ఎద్దేవా చేశారు.

**భిన్న రీతులు :** ఉమ్మడి రాష్ట్ర విభజన నేపథ్యంలో రాజధానిని కోల్పోయి ఉసూరు మంటున్న నవ్యాంధ్ర ప్రజల కలల సాకారం కోసం ఉన్నత ప్రమాణాలతో కూడిన రాజధానికి అమరావతిలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు బాటలు వేయగా అనంతరం అధికారంలోకొచ్చిన జగన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో రాజధాని విధ్వంసానికి గురైన విషయం ప్రజలకు తెలుసునని మంత్రి అన్నారు. అమరావతి రాజధాని నిర్మాణంలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రజల కలలు కనిపిస్తుంటే మాజీ సిఎం జగన్ అందులో లేని అవినీతి జాడలను వెతుక్కుంటున్నారని మంత్రి ఎండగట్టారు.

**ప్రశ్న..సమాధానం; రెండూ జగన్ వే :** అమరావతి రాజధాని కోసం శాసన సభ తీర్మానం ఎందుకు అని ప్రశ్నించిన జగన్‌రెడ్డి సమాధానం కూడా తానే చెప్పుకున్నారని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఎత్తిచూపారు. మరో ప్రభుత్వం అధికారంలోకొస్తే దీనికి భిన్నంగా మరో తీర్మానం చేయకూడదా అన్న జగన్ వ్యాఖ్యలోనే దీనికి సమాధానం ఉందని మంత్రి తెలిపారు. అటువంటి వినాశకర, విధ్వంసకర చర్యల్ని అడ్డుకోడానికే పార్లమెంటు చట్టం ద్వారా రాజధాని అమరావతికి శాశ్వతత్వం కల్పించడానికే రాష్ట్రం మరియు కేంద్రంలోని కూటమి ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయని మంత్రి వివరించారు.

**అసెంబ్లీకి ఎగనామం ఎందుకు జగన్?:** తన తాడేపల్లి ప్యాలెస్‌లో రాజధాని అమరావతి నిర్మాణంపై పలు ప్రశ్నలు సంధించిన జగన్‌రెడ్డి తన పార్టీకి చెందిన 11 మంది సభ్యులతో సహా శాసన సభ సమావేశాలకు ఎందుకు హాజరు కావడంలేదో జవాబివ్వాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ నిలదీశారు. ఇవే అంశాలను తమను ఎన్నుకున్న ప్రజల తరఫున శాసన సభలో లేవనెత్తితే వాటికి మరింత విలువ ఉండేదని...అలా కాకుండా పత్రికా సమావేశాల్లో చేసే ఊకదంపుడు ఉపన్యాసాలకు నిబద్ధత ఉండదనే విషయాన్ని జగన్‌రెడ్డి గుర్తించాలని మంత్రి సూచించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో భవ్య రాజధాని అమరావతి ఆవిష్కారాన్ని జగన్‌రెడ్డి కుట్రలు, దుష్ప్రచారంతో అడ్డుకోలేరని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు.

**రాయలసీమకు తీరని ద్రోహం :** అభివృద్ధి వికేంద్రీకరణ పేరిట మూడు ముక్కలాటకు తెరతీసిన మాజీ సిఎం తన ఐదేళ్ల పాలనలో రాయలసీమకు తీరని ద్రోహం చేశారని మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ ఆగ్రహాన్ని వెలిబుచ్చారు. కర్నూలును న్యాయ రాజధానిగా చేస్తామన్న జగన్ తర్వాత రాయలసీమలో హైకోర్టు బెంచిని మాత్రమే ఏర్పాటు చేస్తామన్నారని...అయినా ఈ దిశగా కనీసం ప్రతిపాదనలు కూడా పంపలేదని మంత్రి తెలిపారు. రాయలసీమలో ఒక్క ప్రాజెక్టును కూడా ఏర్పాటు చేయకపోగా కీలకమైన సాగునీటి ప్రాజెక్టుల పట్ల తీవ్ర నిర్లక్ష్యాన్ని చూపారని జగన్‌పై మంత్రి ధ్వజమెత్తారు. దీనికి భిన్నంగా రాష్ట్రంలోని మూడు ప్రాంతాలను సమ దృష్టితో అభివృద్ధి చేయడానికి కూటమి ప్రభుత్వం సమగ్ర ప్రణాళికలు రచించి అమలు చేస్తోందని మంత్రి వివరించారు.



## ఐఐటి జామ్ పరీక్షల్లో
# పి.బి. సిద్ధార్థకు ర్యాంకులపంట

**విజయవాడ, ఏప్రిల్ 01 (జర్నలిస్ట్ ఫైల్)**

విజయవాడ పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల గణాంకశాస్త్ర, గణితశాస్త్ర విద్యార్థులు ప్రతిష్టాత్మక ఐఐటి జాయింట్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ మాస్టర్స్ (జె.ఎ.ఎం.) 2026 పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపల్ డా. మేకా రమేశ్ తెలిపారు. కళాశాల స్టాటిస్టిక్స్ విద్యార్థి మండలపర్తి వెంకట శివనాగ గణేష్ ఐఐటి జామ్ మ్యాథమెటికల్ స్టాటిస్టిక్స్ పరీక్షలో ఆలిండియా ర్యాంక్ 52 సాధించడంతోపాటు ఐఐటి జామ్ మ్యాథ్స్ పరీక్షలో ఆలిండియా ర్యాంకు 962 సాధించి తన ప్రతిభ చాటుకున్నాడు. కాగా, స్టాటిస్టిక్స్ డిగ్రీ ఆఖరి సంవత్సరం విద్యార్థిని రేష్మా సయ్యద్ జామ్ 2026 మ్యాథమెటికల్ స్టాటిస్టిక్స్ పరీక్షలో ఆలిండియా ర్యాంక్ 514 సాధించింది. ఈ సందర్భంగా డైరెక్టర్ వేమూరి బాబూరావు, స్టాటిస్టిక్స్ విభాగాధిపతి జి. చక్రవర్తి, అధ్యాపకులు ఇ.మురళీకృష్ణ, డా. కె.శివనాగరాజు, కె.నీలిమ, ఎం శివ పార్వతి, గాయత్రి, దివ్య, రాకేష్ ర్యాంకర్లను అభినందించారు. అలాగే తృతీయ సంవత్సరం బీఎస్సీ మ్యాథ్స్ విద్యార్థి కె. జయసుందర్ ఐఐటి జామ్ పరీక్షలో 2424 ర్యాంకు సాధించడం పట్ల మ్యాథ్స్ విభాగాధిపతి ఐ.వి. వెంకటేశ్వరరావు, అధ్యాపకులు అనుపమ, వెంకట రమణ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల మేనేజ్‌మెంట్ ఒక ప్రకటనలో ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులతోపాటు జాతీయస్థాయి పోటీ పరీక్షలకు విద్యార్థులను తీర్చిదిద్దిన స్టాటిస్టిక్స్, మ్యాథ్స్ అధ్యాపకుల కృషిని అభినందించింది.

## ఎమినెంట్ సంస్థకు ఐఐటి జామ్ ఆలిండియా ర్యాంకులు



**విజయవాడ, ఏప్రిల్ 01 (జర్నలిస్ట్ ఫైల్)**

ప్రతిష్టాత్మక ఐఐటి జాయింట్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ మాస్టర్స్ (జామ్) 2026 పరీక్షల్లో విజయవాడకు చెందిన ఎమినెంట్ స్టాటిస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ విద్యార్థులు విజయ ఢంకా మోగించారు. ఐఐటి జామ్ మ్యాథమెటికల్ స్టాటిస్టిక్స్ పరీక్షలో ఎమినెంట్ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించినట్లు డైరెక్టర్ గుళ్ళపల్లి చక్రవర్తి ఒక ప్రకటనలో తెలిపారు. తమ విద్యార్థులు ఆలిండియా ర్యాంకులు 362 (బి. హారిక), 393 (కె. కార్తిక్) 468 (మణికంట), 550 (ఎం.ఎన్. సృజన) 652 (అక్షయ.పి.), 674(ఎం.డి. సోఫియా), 781 (బి. శ్రీవల్లి) సాధించడం పట్ల ర్యాంకర్లతో పాటు అధ్యాపకులు జి.చక్రవర్తి, డా.కె.శివనాగరాజు, ఆర్. గాయత్రి మల్లికలను డైరెక్టర్ టి.అంకమ్మరావు అభినం దించారు. ఈ ఉత్తమ ఫలితాలు ఎమినెంట్ స్టాటిస్టిక్స్ అందిస్తున్న నాణ్యమైన శిక్షణకు నిదర్శనంగా నిలుస్తాయన్నారు. ఎమినెంట్ స్టాటిస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ గణాంక బోధనలో ఉన్నత ప్రమాణాలను పాటిస్తూ జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో ఏటా పలు ఆలిండియా ర్యాంకులు సాధిస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల నమ్మకానికి కొలబద్దగా నిలిచిందన్నారు.

# శ్రీరాముడు భారతీయుల ఊపిరి

- డాక్టర్ మల్లు వేంకట రెడ్డి, తితిదే
- విజయనగరంలో ప్రారంభమైన తితిదే ధార్మిక కార్యక్రమాలు




**కర్నూలు, ఏప్రిల్ 01 (జర్నలిస్ట్ ఫైల్)**

శ్రీరాముడు భారతీయుల ఊపిరని, అనునిత్యం సర్వకాల సర్వావస్థలయందును శ్రీరాముడి స్మరణ లేకుండా జీవించలేరని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లాశాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకట రెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఆళ్ళగడ్డ మండలం, విజయనగరం గ్రామంలోని శ్రీ రామాలయం నందు నాలుగు రోజుల ధార్మిక కార్యక్రమాలను వారు ప్రారంభించారు. మొదటిరోజు ఇస్కాన్ ధర్మ ప్రచారకులు నిత్యతృప్తదాస్ శ్రీమద్రామాయణంపై ప్రవచించారు. తదనంతరం స్థానిక భజన మండలిచే భజనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ భవనం వేణుగోపాల్ రెడ్డి, టి.శ్రీనివాస రెడ్డి, బి.సుబ్బారెడ్డి, ఎ. సుబ్బారెడ్డి, బి.వి.సుబ్బారెడ్డి, బి. శ్రీనివాసులు రెడ్డి, హార్మోనిష్టు నాగేంద్రమ్మ, భజన మండలి సభ్యులు రాజేశ్వరి, కృష్ణవేణి, కల్పన, శిరీష, ఈశ్వరమ్మ, వెంకటరత్నమ్మ, బి. కోటేశ్వరమ్మ, అనంతలక్ష్మి, శ్రావణి, మస్తానమ్మ, పుల్లమ్మ, ప్రసన్న, వెంకాయమ్మ, నవభారతి, బి. సరోజినీ, బజరంగదళ్ ప్రఖండ సంయోజక్ దాసరి నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

## ఒడిశా బీజేపీ నేత దిలీప్ రేను మర్యాదపూర్వకంగా కలిసిన ప్రముఖ పారిశ్రామికవేత్త కోగంటి సత్యం

**విజయవాడ, ఏప్రిల్ 01 (జర్నలిస్ట్ ఫైల్)**



ఒడిశా రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ కేంద్ర మంత్రి, ప్రస్తుత రాజ్యసభ సభ్యుడు దిలీప్ రేను విజయవాడలో ప్రముఖ పారిశ్రా మికవేత్త కోగంటి సత్యం మర్యాద పూర్వకంగా కలిశారు. నగరంలోని నోవోటెల్ హోటల్‌లో జరిగిన ఈ భేటీలో విజయవాడ జనసేన పార్టీ ప్రచార కమిటీ కోఆర్డినేటర్ తిరుపతి సురేష్, గొట్టుముక్కల రామకృష్ణతో పాటు వారి మిత్రబృందం పాల్గొ న్నారు. ఈ సందర్భంగా పరస్పర అభివాదాలు మార్చుకుని, పలు సామాజిక, రాజకీయ అంశాలపై చర్చించినట్లు సమాచారం.

# డిజిటల్ భారతానికి రక్షణ కవచం

- సిటిజన్ ఫోర్స్, టెమా, సిఎంఏఐ, సిఎస్ఏఐ మధ్య అవగాహన ఒప్పందం
- లక్షలాది యువతకు శిక్షణ ఇవ్వడమే లక్ష్యం
- సైబర్ సురక్షిత భారత్ లక్ష్యంగా కీలక అడుగు
- సైబర్ సెక్యూరిటీపై జాతీయ స్థాయి అవగాహన కార్యక్రమాల ప్రారంభం
- భారత టెలికాం పితామహుడు ప్రొఫెసర్ ఎస్.కె.గోయల్ నేతృత్వంలో, సిటిజెన్ ఫోర్స్ తో ప్రతిష్టాత్మక ఒప్పందం
- కార్యక్రమంలో పాల్గొన్న సీపీ శంకబ్రతబాగ్చీ తదితర ప్రముఖులు



**విశాఖపట్నం, ఏప్రిల్ 01 (జర్నలిస్ట్ ఫైల్)**

సైబర్ సురక్షిత భారత్ లక్ష్యంగా కీలక అడుగు పడింది. డిజిటల్ భారతానికి రక్షణ కవచంలా, జాతీయ స్థాయి సైబర్ సెక్యూరిటీ అవగాహన కార్యక్రమాలకు శుభారంభం పలుకుతూ సిటిజన్ ఫోర్స్, టెమా, సిఎంఏఐ, సిఎస్ఏఐ సంస్థల మధ్య అవగాహన ఒప్పందం (వీశీఖ) సంతక కార్యక్రమం మంగళవారం నగరంలోని హోటల్ ఎలిగెంట్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా ప్రజల్లో సైబర్ భద్రతపై అవగాహన పెంపు, యువతకు శిక్షణ, భవిష్యత్తు డిజిటల్ సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంచడం లక్ష్యంగా ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డా. శంఖ బ్రత బాగ్చి మాట్లాడుతూ, డిజిటల్ యుగంలో సైబర్ నేరాలు గణనీయంగా పెరుగుతున్నాయని, వాటిని అరికట్టేందుకు ప్రజల్లో అవగాహన అత్యవసరమని అన్నారు. ముఖ్యంగా యువత సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తగా ఉండాలని, ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు, శిక్షణా కార్యక్రమాలకు పోలీస్ శాఖ తరపున పూర్తి మద్దతు ఉంటుందని తెలి పారు. ఈ సందర్భంగా భారత టెలికాం పితామహుడు ప్రొఫెసర్ ఎస్. కె. గోయల్ మాట్లాడుతూ, భారత్ డిజిటల్ శక్తిగా ఎదుగుతున్న సమయంలో సైబర్ సెక్యూరిటీ దేశ భద్రతతో సమానమని అన్నారు. డిజిటల్ సేవలు విస్తరించడంతో పాటు సైబర్ ముప్పులు కూడా పెరుగుతున్నాయని, అందుకే ప్రతి పౌరుడికి సైబర్ అవగాహన తప్పనిసరి అయిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన లోపం వల్ల మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ఈ కార్యక్రమాన్ని గ్రామ స్థాయి వరకు తీసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు. యువతపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తూ, దేశంలో ఉన్న యువశక్తిని సైబర్ సెక్యూరిటీ రంగంలో తీర్చిదిద్దితే భారత్ ప్రపంచానికి నిపుణులను అందించే కేంద్రంగా మారగలదని తెలిపారు. ఈ ఎంవోయూ ద్వారా ఒక లక్షకు పైగా యువతకు ఏఐ సైబర్ సెక్యూరిటీ రంగాల్లో ప్రాక్టికల్ ట్రైనింగ్ ఇవ్వాలని, ఇండస్ట్రీ అవసరాలకు అనుగుణంగా కోర్సులు రూపొందిస్తున్నామని చెప్పారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన శిక్షణ ద్వారా భారత నిపుణులు గ్లోబల్ స్థాయిలో రాణించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సిటిజెన్ ఫోర్స్ ఫౌండేషన్ సీఎండీ పి. రమేష్ బాబు మాట్లాడుతూ, "సైబర్ సెక్యూరిటీ అనేది ఇప్పుడు ఎంపిక కాదు, ప్రతి పౌరుడి బాధ్యత" అని అన్నారు. గ్రామ స్థాయి నుంచి నగరాల వరకు ప్రతి ఒక్కరికి సైబర్ భద్రతపై అవగాహన కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని, ప్రజల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం విజయవంతమవుతుందని తెలిపారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ "డిజిటల్ యుగంలో సైబర్ సెక్యూరిటీ అనేది అత్యవసరం" అనే సందేశాన్ని ఆయన ప్రస్తావించారు. అలాగే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు యువతలో ఏఐ, సైబర్ సెక్యూరిటీ నైపుణ్యాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని చేసిన పిలుపును ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ ఎంవోయూ ద్వారా పాఠశాలలు, కళాశాలలు, కార్పొరేట్ సంస్థలు, ప్రభుత్వ విభాగాల్లో సైబర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, ప్రత్యేక శిక్షణ మాడ్యూల్స్ రూపొందించడం, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్ చేపట్టడం వంటి కీలక నిర్ణయాలు తీసుకున్నామని వివరించారు. మొత్తంగా, విశాఖపట్నంలో ప్రారంభమైన ఈ జాతీయ స్థాయి సైబర్ సెక్యూరిటీ ఉద్యమం దేశవ్యాప్తంగా డిజిటల్ భద్రతను బలోపేతం చేసే దిశగా ఒక కీలక అడుగుగా నిలుస్తుందని రమేష్ బాబు పేర్కొన్నారు. సైబర్ సెక్యూరిటీపై జాతీయ శిక్షణ, అవగాహన కార్యకారణాల ప్రణాళికలను ఆయన మీడియాకు వివరించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ లా యూనివర్సిటీ పూర్వ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై. సత్యనారాయణ, సిటిజెన్ ఫోర్స్ ఫౌండర్ డైరెక్టర్ పి. ఉమామహేశ్వరి, శ్రీ విశ్వ విద్యాసంస్థల చైర్మన్ కె. ధర్మరాజు, లెండి ఇంజనీరింగ్ కాలేజీ చైర్మన్ పి. మధుసూదనరావు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కె. శివరామకృష్ణ, శ్రీ విశ్వ, లెండి విద్యార్థులు పాల్గొన్నారు.

## యువగళం పాదయాత్ర కేసులో కార్యకర్తలకు ఎమ్మెల్యే మురళీమోహన్ భరోసా

**బంగారంపాలెం, ఏప్రిల్ 01 (జర్నలిస్ట్ ఫైల్)**



యువ నాయకుడు నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర సందర్భంగా నమోదైన కేసుల్లో ఉన్న పార్టీ కార్యకర్తలు, నాయకులకు పూతలపట్టు ఎమ్మెల్యే డా. కలికిరి మురళీమోహన్ భరోసా ఇచ్చారు. చిత్తూరు కోర్టులో హాజరైన బంగారుపాలెం మండలానికి చెందిన కార్యకర్తలను కోర్టు చాంబర్‌లో కలిసి, పార్టీ కోసం పోరాడిన వారిని గుర్తించి, వారి సీనియారిటీ, సేవల ఆధారంగా ఒక సంవత్సరంలోపు ప్రభుత్వ నామినేటెడ్ పదవులు, పార్టీ పదవులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. వారికి తగిన గౌరవం, ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. 2023లో యువగళం పాదయాత్రను అడ్డుకునేందుకు అప్పటి పాలకవర్గం తీసుకున్న చర్యల సమయంలో, బంగారుపాలెం మండల నాయకులు, కార్యకర్తలు ముందుండి పోరాడి పాదయాత్రను విజయవంతం చేసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో పోలీసులు 307తో సహా పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కేసుల్లో ఎ-1 నుంచి ఎ-11 వరకు పలువురు పార్టీ నాయకులు ఉన్నారు. వారికి సంఘీభావంగా ప్రస్తుత బంగారుపాలెం మండల అధ్యక్షుడు ఎన్‌పి ధరణి ప్రసాద్, న్యాయవాది మురళీమోహన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జయచంద్ర నాయుడు, సింగిల్ విండో చైర్మన్ హేమచంద్ర నాయుడు, పట్టణ అధ్యక్షుడు రాధాకృష్ణ నాయుడు తదితరులు కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు ఎమ్మెల్యే హామీపై హర్షం వ్యక్తం చేశారు.

## దక్షిణ భారత పోటీలకు ఎల్ హెచ్ ఆర్ ప్రభుత్వ కళాశాల విద్యార్థినిలు

**మైలవరం, ఏప్రిల్ 01 (జర్నలిస్ట్ ఫైల్)**



గతవారం నున్న వికాస్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీలో నిర్వహించిన క్రిష్ణ యూనివర్సిటీ అంతర్ కళాశాలల ఖో ఖో పోటీలలో స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినిలు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇల్లా రవి తెలియజేశారు. బీఎస్సీ రెండవ సంవత్సరం చదువుతున్న కే.హారిక మరియు జి.సంధ్యారాణిలు యూనివర్సిటీ అంతర్ కళాశాలల ఖో ఖో పోటీలలో తమదైన ప్రతిభను కనబరిచి ఈ జాతీయ పోటీలకు ఎంపిక కావడం జరిగిందని వీరిద్దరూ కూడా మొదటిసారి హనిమిరెడ్డి ప్రభుత్వ కళాశాల యూనివర్సిటీ స్థాయిలో బ్రాంజ్ మెడల్ పొందటానికి కారకులయ్యారని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ మేజర్ మన్నే స్వామి తెలియజేశారు. హారిక, సంధ్యారాణిలు ఏప్రిల్ 1 నుండి 4 వ తేదీ వరకు కర్ణాటకలోని ధార్వాడ్ యూనివర్సిటీ లో నిర్వహించే దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల పోటీలలో కృష్ణ విశ్వవిద్యాలయం తరఫున పాల్గొంటారని కళాశాల ప్రిన్సిపల్ రవి తెలియ జేశారు, ఈ సందర్భంగా వారిని కళాశాల ప్రిన్సిపల్ అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు తమ తమ అభినందనలు తెలియజేశారు.

## కృష్ణా విశ్వవిద్యాలయ మహిళల
# ఖో-ఖో జట్టు దక్షిణ మండల టోర్నమెంట్‌కు పయనం

- నున్నలోని వికాస్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కలాశాలలో శిక్షణా శిబిరం నిర్వహణ

**విజయవాడ, ఏప్రిల్ 01 (జర్నలిస్ట్ ఫైల్)**



ఏప్రిల్ 1 నుండి 4 వరకు జరగనున్న దక్షిణ మండల అంతర్-విశ్వవిద్యాలయ మహిళల ఖో-ఖో టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు, కృష్ణా విశ్వవిద్యాలయ మహిళల ఖో-ఖో జట్టు మంగళవారం కర్ణాటకలోని దావణగెరె విశ్వవిద్యాలయానికి బయలుదేరింది. కఠోర శిక్షణ పొందిన అనంతరం, విజయవాడ నుండి ఈ జట్టు ఎంతో ఆశలతో తమ ప్రయాణాన్ని ప్రారంభించింది. అంతకుముందు, విజయవాడ గ్రామీణ మండలం, నున్నలోని వికాస్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో కృష్ణా విశ్వవిద్యాలయ అంతర్-కళాశాల మహిళల ఖో-ఖో టోర్నమెంట్ నిర్వహించబడింది; ఇందులో క్రీడాకారిణుల ప్రదర్శన ఆధారంగా జట్టు ఎంపిక జరిగింది. తదనంతరం, ఎంపికైన జట్టు నైపుణ్యాలను మెరుగుపరుచుకునేందుకు, మార్చి 30 వరకు అదే ప్రాంగణంలో ఒక శిక్షణా శిబిరం నిర్వహించబడింది. జట్టు బయలుదేరే ముందు, వికాస్ ఇంజనీరింగ్ మరియు టెక్నాలజీ కళాశాల చైర్మన్ నరెడ్ల నర్సిరెడ్డి క్రీడాకారిణులకు ట్రాక్‌సూట్‌లను అందజేశారు. జట్టును ఉద్దేశించి మాట్లాడుతూ, వారు తమ పూర్తి సామర్థ్యంతో రాణించాలని, ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంట్‌లో పతకాలు సాధించి కళాశాలకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆయన ప్రోత్సహించారు. విద్యాబోధనతో పాటు క్రీడలకు కూడా తమ సంస్థ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని ఆయన నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమంలో వికాస్ బీపీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దాసి సురేష్, జట్టు కోచ్ జి. రఘురామ్ తదితరులు పాల్గొన్నారు. కృష్ణా విశ్వవిద్యాలయ మహిళల ఖో-ఖో జట్టు సభ్యుల: రమేజున్నిసా, గరికపాటి సారిక, నలబోలు పూజిత, శెట్టి సూర్య కళ (సిద్ధార్థ మహిళా కళాశాల, విజయవాడ) కొండుద్రు సుచిత్ర, మురుద్ది శృతి, మోసం రాణి, పథర్లపల్లి సాహిత్యం (ఎస్ ఆర్ ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, విజయవాడ); పటపంచల హారిక, గుత్తి సంధ్యారాణి (డాక్టర్ ఎల్‌హెచ్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మైలవరం); మెనిగ రాణి, పెమ్మని కావ్య (పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ మరియు సైన్స్ కళాశాల, విజయవాడ); తిరుమలశెట్టి నాగ చంద్రిక (ఎస్‌పీఎంహెచ్ కళాశాల, మచిలీపట్నం); గణెట్ల మన్మిత (వికాస్ శారీరక విద్యా కళాశాల, నున్న); మరియు సోయం నాగ దుర్గ (విజయా శారీరక విద్యా కళాశాల, నున్న).

# ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎమ్మెల్సీ ఆలపాటి పాలాభిషేకం



తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):తెలుగుదేశంపార్టీ పార్టీకి బీసీ లు వెన్నెముక అని, వారి ప్రయోజనానికి బీసీ సబ్ ప్లాన్ తెచ్చింది చంద్రబాబు ప్రభుత్వామని శాసన మండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ స్పష్టం చేశారు. స్థానిక టిడిపి కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చేనేతలకు కూటమి ప్రభుత్వం ప్రకటించిన హామీల అమలుపై, చేనేతలు చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

ఈ సందర్భంగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ బీసీల్లో మరీ ముఖ్యంగా పద్మశాలియులకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాముఖ్యత నిస్తుందని, చేనేతలకు మగ్గాలు, పవర్లూమ్స్ మీద ఆధారపడిన వారికి 150 కోట్లు నిధులను అందించిన ఘనత కూటమి ప్రభుత్వంలో, ముఖంగా చంద్రబాబు దూరదృష్టికి నిదర్శనమని అన్నారు. 90 శాతం సబ్సిడీ ఆధునిక చేనేత పనిముట్లకు అందిస్తున్నామని,15 శాతం ముడిసరుకు కొనుగోలుకు,రంగులు,రసాయనాలకు కేటాయించడం, అదేవిధంగా తొంబై మూడువేల చేనేత మగ్గాలకు,పదకొండు వేల నాలుగువందల నలభై పవర్ లామ్స్ కు,లబ్ధి చేకూరుతుందన్నారు., సంవత్సరానికి 150 కోట్లు ఉచిత విద్యుత్ కు కేటాయిస్తుందని ప్రత్యేకించి 92,724 మంది చేనేత కార్మికులకు పెన్షన్ అందిస్తున్న ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అని తెలిపారు.

కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ జొన్నాదుల మహేష్,దివి అనిత,పంచుమర్తి భాస్కర్, దివి హేమంత్ కుమార్,సాంబశివరావు,గోలిశ్రీనివాసరావు,
అక్కల ప్రసాద్ రామనాథం కోటి,పడవల దుర్గాప్రసాద్,కొండా గిరీష్,కాటూరి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# పడమర బైపాస్‌పై చినకాకాని వద్ద ఫ్లైఓవర్ నిర్మించాలి



- మంగళగిరి మండల ప్రయాణికుల సంక్షేమ సంఘం కార్యదర్శి నన్నపనేని నాగేశ్వరరావు

మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):అధికారుల అనాలోచిత చర్యల వలన మంగళగిరి మండలం చినకాకాని వద్ద పడమర బైపాస్ పై రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని మంగళగిరి మండల ప్రయాణికుల సంక్షేమ సంఘం కార్యదర్శి నన్నపనేని నాగేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం మాట్లాడుతూ, గత 15 ఏళ్ల క్రితం పడమర బైపాస్ నిర్మాణం ప్రారంభమైన సమయంలో ఇక్కడ ఫ్లై ఓవర్ నిర్మిస్తేనే ప్రమాదాలను అరికట్టేందుకు వీలుంటుందని తాను సూచించినట్లు చెప్పారు. నిర్మాణం పూర్తయ్యాక చూద్దాంలే అని ఆరోజు చెప్పారని తెలిపారు. బైపాస్ నిర్మాణం పూర్తయ్యాక చినకాకాని వద్ద పడమర బైపాస్, తూర్పు బైపాస్ అనుసంధానం అయ్యే ప్రాంతంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, దీని వలన ప్రజలు తమ ప్రాణాలు కోల్పోతున్నారని, అనేక మంది తీవ్రంగా గాయాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేవరపల్లి నుంచి కొవ్వూరు చేరుకునే హైవేపై ఉన్న తరహాలో ఫ్లై ఓవర్ నిర్మించాలని సూచించారు. లేదంటే ప్రమాదాలు ఆగే పరిస్థితి ఉండదని తెలిపారు. ఫ్లై ఓవర్ నిర్మాణం దిశగా చర్యలు తీసుకుని

# దివ్యాంగురాలి జీవితంలో వెలుగులు

- 18 ఏళ్ల తర్వాత పింఛన్ మంజూరు
- ఫలించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ కృషి
- ఆధార్ కార్డు లేకుండానే పింఛన్ మంజూరు చేయించిన ఎమ్మెల్యే నసీర్
- సీఎంకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన ఎమ్మెల్యే నసీర్, బాలిక తల్లి



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): గుంటూరు తూర్పు ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో రాష్ట్ర చరిత్రలో ఎన్నడూలేని విధంగా ఓ దివ్యాంగురాలికి పింఛన్ మంజూరైంది. దివ్యాంగురాలి పరిస్థితి చూసి 18 ఏళ్లుగా సాయం కోసం తల్లిదండ్రులు చేస్తోన్న ప్రయత్నం ఎమ్మెల్యే నసీర్ కృషితో నెరవేరింది. గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని మంగళదాస్ నగర్ కు చెందిన ఎనుముల కనకదుర్గ పుట్టుకతోనే కంటిచూపు చేతులు సరిగా లేకుండా జన్మించింది. ఆమె తల్లిదండ్రులు రామ శ్రీనివాస రెడ్డి, సత్య గోమేశ్వరి కూతురికి ఆధార్ కార్డు కోసం అన్ని కార్యాలయాల చుట్టూ తిరిగారు. ఫింగర్ ప్రింట్స్, ఐరిస్ లేకపోవడంతో ఆధార్ కార్డు లేదు. దీంతో దివ్యాంగ పింఛన్ కోసం 18 ఏళ్లుగా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. కానీ ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ క్రమంలో మూడేళ్ల క్రితం బాలిక తండ్రి మరణించారు. ఆరు నెలల క్రితం స్థానిక కూటమి నాయకుల సాయంతో కనకదుర్గ తల్లి ఎమ్మెల్యే నసీర్ ను కలిశారు. బాలిక వేదనను చూసి ఎమ్మెల్యే నసీర్ చలించిపోయారు. ఎలాగైనా కనకదుర్గకు న్యాయం చేస్తామని, పింఛన్ వచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే నసీర్ స్వయంగా కనకదుర్గ పరిస్థితిని సీఎం చంద్రబాబు నాయుడు గారి దృష్టికి తీసుకెళ్లారు. సీఎం వెంటనే స్పందించి ఐరిస్, ఫింగర్ ప్రింట్ లేకుండా పింఛన్ అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో కనకదుర్గకు ఏప్రిల్ నుంచి పింఛన్ మంజూరైంది. బుధవారం మంగళదాస్ నగర్ వెళ్లిన ఎమ్మెల్యే నసీర్ కనకదుర్గకు స్వయంగా పింఛన్ పంపిణీ చేశారు. ఇంత కాలానికి తమ బిడ్డకు పింఛన్ అందేలా చేసిన ఎమ్మెల్యే నసీర్ గారికి కు, సీఎం చంద్రబాబు నాయుడు గారికి బాలిక తల్లిదండ్రులు రెండు చేతులు జోడించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే నసీర్ మంగళ దాస్ నగర్, ప్రకాష్ నగర్ ప్రాంతాలలో కూటమి నాయకులు, సచివాలయ సిబ్బందితో కలిసి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో జరుగుతోందని తెలిపారు రాష్ట్ర రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించడం గొప్ప పరిణామం అని పేర్కొన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు మంజూరు చేయించడం సంతోషంగా ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# గుంటూరు జిల్లా నూతన కలెక్టర్‌గా సి.యం. సాయి కాంత్ వర్మ



ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్): గుంటూరు జిల్లా నూతన కలెక్టర్ గా సి.యం. సాయి కాంత్ వర్మ బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆయన 2015 బ్యాచ్ ఐ.ఏ.ఎస్ అధికారి విశాఖపట్నంలో అసిస్టెంట్ కలెక్టర్ గా, రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ గా, పూర్వ శ్రీకాకుళం జిల్లా సీతంపేట ఐటిడిఎ ప్రాజెక్టు అధికారిగా, వై.ఎస్.ఆర్ కడప జిల్లా జాయింట్ కలెక్టర్ గా, గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ గా, ఎపి టౌన్షిప్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ గా, ఆంధ్ర ప్రదేశ్ ఎకనామిక్ డెవలప్మెంట్ బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గా ఇప్పటి వరకు పనిచేశారు.

మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ జిల్లా సర్వతోముఖ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఎంతో ప్రాముఖ్యం ఉన్న జిల్లాకు కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించడం ఆనందంగా ఉందన్నారునమ్మకంతో ప్రభుత్వం, ముఖ్యమంత్రి నియమించడం జరిగింది. వారి ఆశయాలకు అనుగుణంగా పనిచేయుటకు శాయశక్తుల కృషి చేస్తామని అన్నారు

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు క్షేత్ర స్థాయి వరకు పక్కాగా అమలుకు శ్రద్ధ వహిస్తామన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్వర్ణాంధ్ర విజన్ ఏ2047, పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్, పథకాల పట్ల ప్రజల సంతృప్త స్థాయి పెరుగుదల, తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని అన్నారు.

ప్రజలకు మంచి సేవలు అందించుటకు ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజల భాగస్వామ్యంతో సమష్టిగా కృషి చేస్తామని చెప్పారు. ముందుగా వేద పండితులు వేదమంత్రాలతో ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్, గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి, రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, గుంటూరు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, జిల్లా అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

# దోమల నివారణకు గుంటూరులో డ్రోన్‌ల ద్వారా యాంటీ లార్వా ఆపరేషన్

- నగర కమిషనర్ వెల్లడి



ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్): వర్షాకాలంలో దోమల వలన సంక్రమించే వ్యాధుల నివారణకు ముందస్తు చర్యల్లో భాగంగా డ్రోన్ ల ద్వారా యాంటీ లార్వా ఆపరేషన్లను నగరంలో వార్డ్ ల వారీగా సిద్దం చేసిన యాక్షన్ ప్లాన్ మేరకు విస్తృతంగా చేపట్టాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ సిఎంఓహెచ్ ని ఆదేశించారు. బుధవారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్ లో సిఎంఓహెచ్, బయాలజిస్ట్, మారుత్ డ్రోన్స్ ప్రతినిధులతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సమావేశంలో దోమల నివారణకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యల పై చర్చించి, తగు ఆదేశాలు జారీ చేశారు.

ఈ సందర్భంగా కమిషనర్ తొలుత డ్రోన్ల సామర్ధ్యం, ఫ్యూయల్ కెపాసిటీ, పనితీరుని అడిగి తెలుసుకొని, మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను నివారించుటలో భాగంగా, దోమలను, వాటి లార్వాని అరికట్టుటకు రాష్ట్ర ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్ట్ గా తొలుత 7 కార్పొరేషన్లలో యాంటి లార్వా యాక్టివిటీస్ నిర్వహించుటకు మారుత్ డ్రోన్స్ కు ఏజన్సీ కేటాయించిందన్నారు. సదరు ఏజన్సీ నగరంలో మురుగు నీరు నిలువ ఉన్న ఖాళీ స్థలాలు, చెరువులు, కుంటల్లో డ్రోన్స్ ద్వారా యాంటి లార్వా మందును స్ప్రే చేసి, దోమలను నివారిస్తారన్నారు. ఇప్పటికే నగరంలో 13 ప్రాంతాల్లో మస్కిటో ట్రాప్ మిషన్లను ఏర్పాటు చేశారని, 6 ప్రాంతాలలో మస్కిటో సెన్సార్లను ఏర్పాటు చేశారన్నారు. ఏటుకూరు ప్రాంతంలో డ్రోన్స్ ద్వారా యాంటి లార్వల్ యాక్టివిటీస్ ను ట్రయిల్ రన్ కూడా విజయవంతంగా నిర్వహించారన్నారు. నగరంలో ఏ ఏ ప్రాంతాలలో దోమలు అధికంగా ఉంటాయో గుర్తించి ఆయా ప్రాంతాలలో యాంటి లార్వాల్ యాక్టివిటీస్ నిర్వహించుటకు యాక్షన్ ప్లాన్ కూడా సిద్దం చేశారన్నారు. డ్రోన్ టీం నగరంలోని అన్ని ప్రాంతాలలో యాంటి లార్వల్ యాక్టివిటీస్ ను నిర్వహించాలని, సదరు పనులను సిఎంఓహెచ్, బయాలజిస్ట్ లు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షిస్తూ రోజువారీ కార్యక్రమ నివేదికను తమకు అందించాలని ఆదేశించారు. సదరు సమావేశంలో సియంఓహెచ్ డాక్టర్ శాంతి కళ, బయాలజిస్ట్ శేషయ్య, మారుత్ డ్రోన్స్ ప్రతినిధి శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

# అందరివాడు 'గాజుల' మరింత ఎదగాలి



- అసిస్టెంట్ గవర్నర్ గా ఎన్నికైన గాజుల శ్రీనివాసరావుకు ఎంఎంకే స్టేడియం ప్రతినిధుల సత్కారం

మంగళగిరి ( జర్నలిస్ట్ ఫైల్):తమ స్టేడియం డోనర్ మెంబర్ గాజుల శ్రీనివాసరావు రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 3150 అసిస్టెంట్ గవర్నర్ గా ఎన్నికైన శుభసందర్భాన్ని పురస్కరించుకుని మోతుకూరి మాలకొండయ్య మెమోరియల్ (ఎంఎంకె) ఇండోర్ స్టేడియం ప్రతినిధులు హర్షం వ్యక్తంచేశారు. ఈ మేరకు బుధవారం ఉదయం స్టేడియం ఆవరణలో గాజుల శ్రీనివాసరావుకు అభినందన సత్కారకార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంఎంకే స్టేడియం ప్రతినిధులు రావూరి రమేష్ బాబు, కొత్తపల్లి శ్రీనివాసరావు, ఉడతా శ్రీనివాసరావు, మౌలాఖాన్, శివాజీ, మాచర్ల శ్రీనివాసరావు (సిటీకేబుల్ శ్రీను), అవ్వారు శ్రీనివాసరావు (బుజ్జి), కె.సైదానాయక్ తదితరుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అభినందన, సత్కార సభలో కాపు కార్పొరేషన్ డైరెక్టర్ విన్నకోట శ్రీనివాసరావు, మంగళగిరి రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ ప్రెగడ రాజశేఖర్, చార్టర్ ప్రెసిడెంట్ అనిల్ చక్రవర్తి ఇసునూరు, కార్యదర్శి పారేపల్లి నిరంజన్ గుప్తా, కోశాధికారి కేవీఎస్ ప్రకాశరావు, పూర్వ అధ్యక్షుడు అందె రేవంత్, పూర్వ కోశాధికారి వడ్లమూడి శ్రీనివాసరావు, కె.శివరామరాజు, ప్రముఖ వైద్యులు టీఎస్ రాఘవ, దంతవైద్యులు చక్రవర్తి చింతక్రింది తదితర స్టేడియం సభ్యులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పలువురు ప్రతినిధులు మాట్లాడుతూ స్వర్ణకార రంగంలో స్వశక్తితో ఎదిగిన గాజుల శ్రీనివాసరావు అందరివాడిగా గుర్తింపు పొందారని కొనియాడారు. ఎంఎంకే స్టేడియం డోనర్ సభ్యుడిగాను, ఎల్ఎన్ గోల్డ్ స్మిత్ వెల్ఫేర్ సొసైటీ కోశాధికారిగా, మంగళగిరి రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా సేవారంగంలో తనదైన ముద్ర వేశారని, వీరి సేవలకు గుర్తింపుగా రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 3150 అసిస్టెంట్ గవర్నర్ గా పదోన్నతి లభించిందని వారు అభిప్రాయపడ్డారు. ఇప్పటివరకు మంగళగిరి రోటరీ క్లబ్ సేవాకార్యక్రమాల్లో పాలుపంచుకున్నారని, ఇప్పుడు రోటరీ అసిస్టెంట్ గవర్నర్ గా మంగళగిరి రోటరీ క్లబ్ తో పాటు గుంటూరు సెంటినియల్, పొన్నూరు, బాపట్ల రోటరీ క్లబ్ లకు బాధ్యత వహిస్తారని, ఇదే స్ఫూర్తితో మున్ముందు మరిన్ని సామాజికపరమైన సేవాకార్యక్రమాలను కొనసాగిస్తూ... భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా స్టేడియం ప్రతినిధులు, సభ్యులు, రోటరీ క్లబ్ ప్రతినిధులు తదితర ప్రముఖులు గాజుల శ్రీనివాసరావును పట్టుశాలువాలు, పూలమాలలు, బొకేలతో ఘనంగా సత్కరించారు. సన్మాన గ్రహీత గాజుల శ్రీనివాసరావు మాట్లాడుతూ జీరో నుంచి ప్రస్థానాన్ని ప్రారంభించానని, తొలినుంచి రావూరి రమేష్ బాబు అన్నివిధాలుగా అండదండలు అందించారని, ఈ రోజు తానీస్థాయికి రావడంలో రమేష్ బాబు కృషి ఎనలేనిదని, అలాగే మంగళగిరి రోటరీ క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ అనిల్ చక్రవర్తి, రొటేరియన్ల సహకారం వల్లే తనకు రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 3150లో మంచి గుర్తింపు లభించిందని, ఈ రోజు అసిస్టెంట్ గవర్నర్ పదవి రావడంలో వీరందించిన సహకారం మరువలేనిదన్నారు. మరీ ముఖ్యంగా ఎంఎంకే స్టేడియంతో తనకు ఎంతో అనుబంధం వుందని స్టేడియం పెద్దల సహకారం, సభ్యుల ప్రోత్సాహం తన ఎదుగుదలలో గణనీయమైన పాత్ర

# గుంటూరులో ఉద్యోగం సంతృప్తిని ఇచ్చింది

- ప్రజల కలెక్టర్‌గా మన్ననలు పొందారు
- తమీమ్ అన్సారియా వెల్లడి




ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్): గుంటూరులో ఉద్యోగ నిర్వహణ సంతృప్తిని ఇచ్చిందని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. జిల్లా కలెక్టర్ బదిలీ సందర్భంగా ఎస్.ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులు, రెవిన్యూ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా వీడ్కోలు కార్యక్రమం జరిగింది. జిల్లా కలెక్టర్ కు ఘన సత్కారం చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తన పదవీకాలంలో అందించిన సహకారానికి అధికారులకు, సిబ్బందికి, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా అభివృద్ధికి అందరూ సమన్వయంతో పనిచేసినందునే పలు కార్యక్రమాలు విజయవంతం అయ్యాయని చెప్పారు. ప్రజలకు మంచి సేవలు అందించాలనే లక్ష్యంతో పనిచేయడం జరిగిందన్నారు. నిబద్ధతతో పనిచేయడం వలన సంతృప్తి లభిస్తుందని చెప్పారు.

పోలీస్ సూపరింటెండెంట్ వకుల్ జిందాల్ మాట్లాడుతూ జిల్లాలో మంచి సమన్వయంతో పాలన సాగించారన్నారు.

జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ నాయకత్వంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా జరిగాయని తెలిపారు. పరిపాలనలో పారదర్శకత, ప్రజల సమస్యల పరిష్కారంలో వేగం తీసుకువచ్చినట్లు కొనియాడారు. పీ.జీ.ఆర్.ఎస్ మార్పు, దివ్యాంగుల వద్దకు నేరుగా వెళ్లి అర్జీలు స్వీకరించడం, తురకపాలెం సంఘటన, మొంథా తుఫాను సమయంలోను, జీ.ఎస్.టి ప్రచార కార్యక్రమాలు, మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్, విజయం మనదే, సరస్ మేళా విజయవంతంతో పాటు రాష్ట్ర స్థాయి కార్యక్రమాలు అన్ని చక్కని పర్యవేక్షణతో విజయవంతం చేశారని కొనియాడారు.

గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్ మాట్లాడుతూ పట్టణంలో మౌలిక సదుపాయాలు కల్పనలో చక్కటి సూచనలు అందజేశారని అన్నారు. నగర పాలక సంస్థ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టిన మరుక్షణమే వివిధ కార్యక్రమాలపై దృష్టి సారించారని అన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి మాట్లాడుతూ ప్రజల కలెక్టర్ గా మన్ననలు పొందారన్నారు. కలెక్టర్ మార్గదర్శకత్వంలో రెవెన్యూ విభాగం సమర్థంగా పనిచేసిందని, ప్రజలకు మెరుగైన సేవలు అందించగలిగామని తెలిపారు. ప్రకాశం జిల్లాలో బంగారు బాల్యం కార్యక్రమం అమలు చేసి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారన్నారు.

ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారులు కె.శ్రీనివాస రావు, లక్ష్మీ కుమారి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె విజయ లక్ష్మి, గుంటూరు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె.కళ్యాణ చక్రవర్తి, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, జలవనరుల శాఖ పర్యవేక్షక ఇంజనీర్ వెంకట రత్నం, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎం.
పద్మావతి, ఉద్యాన శాఖ ఉప సంచాలకులు రవీంద్ర బాబు, పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు కె.వి.వి సత్యనారాయణ,జిల్లా పౌర సరఫరాల అధికారి పి.కోమలి పద్మ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి యు. చెన్నయ్య, జిల్లా మత్స్య శాఖ అధికారి పి.ఎన్.కిరణ్ కుమార్, ముఖ్య ప్రణాళిక అధికారి పి.శేష శ్రీ, ప్రభుత్వ ప్లీడరు సురేష్, తహసిల్దార్ లు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా జరిగిన సీతారామ కళ్యాణం నూతన ధ్వజస్తంభ స్థాపన



- ముఖ్యఅతిథిగా హాజరైన మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్, టిడిపి జిల్లా అధ్యక్షులు భూపేష్ రెడ్డి

బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్)
మండలం లోని రేకులకుంట పంచాయతీ పరిధిలోని డి.అగ్రహారం గ్రామము నందు నూతనంగా నెలకొల్పిన శ్రీ గణపతిస్వామి సుబ్రహ్మణ్య స్వామి శ్రీ హనుమత్ లక్ష్మణ సహిత శ్రీ సీతారామచంద్రస్వాములవారు ధ్వజస్తంభం నూతన ప్రతిష్ట మహోత్సవం మరియు సీతారాముల కల్యాణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మైదుకూరు ఎమ్మెల్యే పుట్ట సుధాకర్ యాదవ్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు భూపేష్ రెడ్డి పాల్గొన్నారు. జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు కానాల మల్లికార్జునరెడ్డి వారికి ఘన స్వాగతం పలికారు. ఆలయ మర్యాదలతో సన్మానం చేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ ఈశ్వరీ దేవి మఠం మఠాధిపతులు శ్రీ శివ కుమార స్వాముల వారు ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు అందుకున్నారు.. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వీరనారాయణరెడ్డి ఎంపీడీవో వై రామచంద్రారెడ్డి టిడిపి మండల అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి సొసైటీ చైర్మన్ ఎల్లటూరి సాంబశివరెడ్డి మండల సీనియర్ నాయకులు ఎస్ఆర్ శ్రీనివాస్ రెడ్డి ఆవుల దస్తగిరి ఉపాధ్యక్షులు శీలం నరసింహ గౌడ్ కార్యకర్తలు మరియు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# బీజేపీ జిల్లా అధ్యక్షునికి తిరునాళ్ల ఆహ్వానం



కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్ ):ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రసిద్ధిగాంచిన స్వయం భూ శ్రీ పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం కు సంబంధించి ఆహ్వానం పత్రికను ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యురాలు, బీజేపీ మహిళా నాయకురాలు గంటా నాగ జ్యోతి బీజేపీ జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతి రావు కు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలేరమ్మ అమ్మవారి జాతరకు రాష్ట్ర నలుమూలల నుండి లక్షలాదిగా భక్తులు హాజరవుతారని తెలిపారు. జాతరలో పాల్గొని అమ్మవారి ఆశీర్వాధాలు అందుకోవాలని కోరారు. ఏప్రిల్ 7 వ తేదీన పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం జరగనున్నట్లు తెలిపారు.

# పింఛన్లు పంపిణీ చేసిన నూతన కలెక్టర్ సాయి కాంత్ వర్మ



ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్): ఎన్.టి.ఆర్ భరోసా పింఛన్లను జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ బుధవారం గుండారావు పేట స్వర్ణ వార్డు పరిధిలో పంపిణీ చేశారు. జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన వెంటనే పేదల పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజలతో మమేకమై వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ఏ విధంగా అందుతున్నాయని ఆరా తీసారు. మంచంపైన ఉన్న దివ్యాంగురాలు మనస్వినికి, దుగ్గిపోగు సలోమి, యేసయ్య, సలికినేటి ప్రేమ కుమార్ లతో వీధిలోని అందరికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 2,53,379 మంది పింఛనుదారులకు రూ.110.50 కోట్లు పంపిణీ జరుగుతుందని చెప్పారు. పింఛన్లు పంపిణీ సాఫీగా చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో మొత్తం పింఛన్లలో వృద్ధాప్యపు పింఛన్లు 1,13,860., వితంతువులు 71,608., చేనేతకారులు 3,765., గీతకార్మికులు 443., మత్స్యకారులు 564., ఒంటరి మహిళలు 11,265., చర్మకారులు 866., హిజ్రాలు 67., హెచ్.ఐ.వి బాధితులు 2,580., కళాకారులు 74., డప్పు కళాకారులు 847., దివ్యాంగులు 24,493., వైద్య సంబంధిత పింఛనుదారులు 1,587., సైనిక సంక్షేమం 25., అభయహస్తం 3,932., అమరావతి భూముల సంబంధిత 17,413 పింఛన్లు పంపిణీ ఉన్నాయన్నారు.

**చిన్నారులతో కలిసి... ముచ్చటించి:** వీధిలో చిన్నారులు జిల్లా కలెక్టర్ కు పుష్పాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారులతో ఒకటిగా కలిసిపోయారు. వారి పేర్లను అడిగారు. మంచి పేరు పెట్టుకున్నారు.. అని ప్రశంసించారు. రోజు బడికి వెళుతున్నారా? మధ్యాహ్న భోజనం తీసుకుంటున్నారా? అని అడిగారు. బాగా చదవాలి అని సూచించారు. పింకీ అనే చిన్నారిని ఎత్తుకుని నీ పేరు బాగుంది అని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# చంద్రబాబు హీరో... జగన్ విలన్ : రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత

- ఉచిత విద్యుత్ అమలుతో నేతన్నలకు ఆర్థిక మేలు
- ఏటా రూ.150 కోట్ల వ్యయం
- మగ్గం నేతన్నలకు 200 యూనిట్లు, మరమగ్గం నేతన్నలకు 500 యూనిట్లు ఉచితం
- రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో పరుగులు పెట్టిస్తున్న సీఎం చంద్రబాబు
- రాష్ట్ర పతనాన్ని కోరుకుంటున్న జగన్
- భవిష్యత్తులో జగన్ వల్ల ఇబ్బందులు రాకూడదనే అమరావతికి చట్టబద్ధత : మంత్రి సవిత
- పెనుకొండలో చేనేతలకు ఉచిత విద్యుత్ ధ్రువపత్రాలు అందజేసిన మంత్రి సవిత



**పెనుకొండ (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో వరుసగా సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు ప్రజల మనస్సుల్లో హీరోగా నిలిచారని, రాష్ట్ర పతనాన్ని కోరుకుంటున్న జగన్‌ను విలన్ గా చూస్తున్నారని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. చోరీలకు కేరాఫ్ అడ్రాస్ జగన్ అని విమర్శించారు. ఆయన చోరీలను క్రెడిట్ చేసుకోవాల్సిన దుస్థితి ఎవరికీ లేదని ఎద్దేవా చేశారు. చేనేతలు గౌరవప్రదమైన జీవనం సాగించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. అందులో భాగంగానే ఎన్నికల హామీని నెరవేరుస్తూ నేతన్నలకు ఉచిత విద్యుత్ పథకానికి సీఎం చంద్రబాబునాయుడు శ్రీకారం చుట్టారన్నారు. ఇప్పటికే చేనేత రంగ అభివృద్ధికి అమలు చేస్తున్న పథకాలతో పాటు ఉచిత విద్యుత్ పథకానికి నాంది పలుకడంతో నేతన్నలకు మరింత ఆర్థిక పరిపుష్టి కలగనుందన్నారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ పట్టణంలో రైల్వే స్టేషన్ రోడ్డు కాలనీలో బుధవారం నేతన్నలకు ఉచిత విద్యుత్ పథకానికి సంబంధించిన ధ్రువ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేరుస్తూ సూపర్ సిక్స్ పథకాలను విజయవంతం చేసిందన్నారు. మహిళలకు, దివ్యాంగులకు, రైతులకు, నేతన్నలకు ఇలా అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసేలా సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ఇటీవలే దివ్యాంగులకు కూడా ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పిస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలే కల్పనే లక్ష్యంగా ఉగాది పండుగ నాడు జాబ్ క్యాలెండర్ విడుదల చేసిందన్నారు.

**చంద్రబాబు రాకతో చేనేత మహర్దశ :** జగన్ ప్రభుత్వ తీరుతో పూర్తిగా నిర్వీర్యమైపోయిన చేనేత రంగానికి 2024లో సీఎం చంద్రబాబు ఏర్పాటుతో మహర్దశ ప్రారంభమైందన్నారు. నేతన్నలకు మేలు కలిగేలా పథకాలు అమలుచేస్తున్నారన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కింద 92,724 మంది నేతన్నలకు రూ. 3 వేల నుంచి రూ. 4 వేలకు పెన్షన్ మొత్తం పెంచామన్నారు. చేనేతలకు థ్రిఫ్ట్ కింద ప్రభుత్వ వాటాను 8 నుంచి 16 శాతానికి పెంచిందన్నారు. ఈ పథకం కింద ప్రతి బడ్జెట్ లోనూ రూ. 5 కోట్లు చొప్పున్న కేటాయిస్తూ వస్తున్నామన్నారు. క్యాష్ క్రెడిట్ కార్డులతో సహకార సంఘాలకు బ్యాంకు రుణాలు అందజేస్తున్నామన్నారు. 15 శాతం రాయితీపై నూలు సబ్సిడీ పథకం అమలు చేస్తున్నారమన్నారు. 2,640 మంది చేనేత కార్మికులకు ముద్ర పథకం కింద రూ. 24.43 కోట్లు అందజేశారన్నారు. చేనేత వస్త్రాల అమ్మకాలు పెంచేలా చర్యలు తీసుకుంటూ, రాష్ట్ర వ్యాప్తంగా చేనేత ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. నేతన్నల ఆరోగ్య పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. దీనిలో భాగంగా యూనివర్సల్ హెల్త్ పాలసీ ద్వారా నేతన్నల ఆరోగ్య రక్షణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. చేనేత రంగ అభివృద్ధి కోసం ముడి సరుకులపై సబ్సిడీ, నెట్ ఫండ్ అందజేస్తూ, ఆధునిక డిజైన్లపై శిక్షణ అందిస్తున్నామన్నారు. పనిముట్ల కొనుగోలుకు 90 శాతం వరకు సబ్సిడీతో అందజేస్తున్నామన్నారు.

**రూ.150 కోట్లతో ఉచిత విద్యుత్ అమలు :** నేతన్నల కుటుంబాల్లో వెలుగులు నింపేలా కూటమి ప్రభుత్వం కీలకమైన ఉచిత విద్యుత్ పథకానికి శ్రీకారం చుట్టిందని మంత్రి సవిత తెలిపారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. ఇందుకోసం ప్రభుత్వం ఏటా రూ. 150 కోట్లు వెచ్చించనునందన్నారు. మగ్గంపై నేసే నేతన్నలకు 200 యూనిట్లు, పవర్ లూమ్ మగ్గాల నేతన్నలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందజేయబోతున్నాం. ఈ పథకం ద్వారా ఏడాదికి మగ్గం నేతన్నలకు రూ. 8,640లు, మర మగ్గం నేతన్నలకు రూ. 21,600లు ఆదా అవుతుందన్నారు. 1,04,000 మంది చేనేత కుటుంబాలు ఉచిత విద్యుత్ పథకం ద్వారా లబ్ధి పొందుతాయి. ఈ పథకంతో నేతన్నలకు ఆర్థిక వెసులుబాటు కలుగుతుందనడంలో సందేహం లేదన్నారు. నేతన్నలు గౌరవప్రదమైన జీవనం సాగించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సవిత స్పష్టంచేశారు.

**చంద్రబాబు హీరో... జగన్ విలన్... :** రాష్ట్రంలో సంక్షేమాన్ని, అభివృద్ధిని జోడు గుర్రాల్లా సీఎం చంద్రబాబునాయుడు పరుగులు పెట్టిస్తున్నారని మంత్రి సవిత తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు కలిగేలా పథకాలు అమలు చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో అన్ని రోడ్లను అభివృద్ధి చేస్తున్నామన్నారు. పెనుకొండ పట్టణంలో రైల్వే స్టేషన్ రోడ్డు నిర్మించడంపై పట్టణ ప్రజలు ఆనందం వ్యకం చేస్తున్నారన్నారు. చోరీలకు కేరాఫ్ అడ్రాస్ జగన్ అని విమర్శించారు. ఆయన చోరీలను క్రెడిట్ చేసుకోవాల్సిన దుస్థితి ఎవరికీ లేదన్నారు. జగన్ విధ్వంస పాలన వల్ల రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందన్నారు. అమరావతి రాజధానికి జగన్ వల్ల భవిష్యత్తులో ఎటువంటి నష్టం రాకూడదనే చట్టబద్ధత కల్పిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్రానికి పంపామన్నారు. రాష్ట్రంలో వరుసగా సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు ప్రజల మనస్సుల్లో హీరోగా నిలిచారని, రాష్ట్ర పతనాన్ని కోరుకుంటున్న జగన్ ను విలన్ గా చూస్తున్నారని అన్నారు. అంతకుముందు పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డు కాలనీలో చేనేత కార్మికులకు మంత్రి సవిత ఉచిత విద్యుత్ ధ్రువపత్రాలను అందజేశారు. చేనేత రంగానికి సీఎం చంద్రబాబు, కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు, చేనేత కుటుంబాలు పాల్గొన్నారు.

**ప్రతి నెలా ఒకటో తేదీన పెన్షన్ల పండగ :** పట్టణంలో రైల్వేస్టేషన్ రోడ్డు కాలనీలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను మంత్రి సవిత ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ప్రతి నెలా ఫస్ట్ తారీఖున రాష్ట్ర వ్యాప్తంగా పెన్షన్ల పండుగ జరుగుతోందన్నారు. ఏప్రిల్ నెలకు సంబంధించి, రాష్ట్ర వ్యాప్తంగా 62.60 లక్షల మందికి పింఛనుదారులకు రూ. 2,724 కోట్లను పంపిణీ చేస్తున్నామన్నారు.

దేశంలో మరే రాష్ట్రంలోనూ ఇవ్వని విధంగా వృద్ధాప్యం, వింతతు, ఒంటరి మహిళలకు రూ. 4 వేలు చొప్పున, దివ్యాంగులకు రూ. 6 వేలు చొప్పున పెన్షన్లు అందజేస్తున్నామని మంత్రి సవిత తెలిపారు.

## వైద్య సేవలకు సీఎం సహాయ నిధి ఊహించని ఉరట : ఎమ్మెల్సీ ఆలపాటి



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** వైద్యసేవలకు తప్పనిసరిగా కావలసిన నగదు వ్యయం చేయలేనివారికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా లభించే ఆర్థిక చేయూత ఆకుంటుబాలకు ఊరట నిస్తుందని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ సి ఎమ్ చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. స్థానిక గంగానమ్మ పేటకు చెందిన షేక్ బాజీవలి వైద్య సేవలకు, ఆర్థిక పరిస్థితి సరిగా లేదని గుర్తించిన ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ప్రత్యేక చొరవతో, సి ఎమ్ సహాయ నిధి ద్వారా, 2,30,730నగదు శాంక్షన్ చేయించారు. ఈక్రమంలో బుధవారం శాంక్షన్ అయిన చెక్కును ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ బాజీవలికి అందజేశారు. ఈసందర్భంగా బాజీవలి కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పట్టణ టిడిపి అధ్యక్షులు మహ్మద్ కుద్దూస్ తదితరులున్నారు.

## ఏపీ పరిపాలనా ట్రిబ్యునల్ పునరుద్ధరణకు ఫోర్టో విజ్ఞప్తి

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ పరిపాలనా ట్రిబ్యునల్‌ను తక్షణమే పునరుద్ధరించాలని ఫోరం ఆఫ్ రిజిస్టర్డ్ టీచర్ ఆర్గనైజేషన్స్ (ఫోర్టో) రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఫోర్టో చైర్మన్ కరణం హరికృష్ణ, సెక్రటరీ జనరల్ అంకాల కొండయ్యతో పాటు రాష్ట్ర నాయకులు వెంకటరెడ్డి, బృందబాన్ డొలై, బోనెల రమేష్, బలివాడ ధనుంజయరావు, బీరప్ప, పెద్దన్న సంయుక్త ప్రకటన విడుదల చేశారు.

ప్రకటనలో వారు పేర్కొంటూ, రాష్ట్రంలో ఉద్యోగుల సేవా సంబంధిత వివాదాల పరిష్కారానికి ప్రత్యేకంగా ఏర్పాటైన ఆంధ్రప్రదేశ్ పరిపాలనా ట్రిబ్యునల్‌ను 2020లో రద్దు చేయడం వల్ల ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 371–డీ ప్రకారం ప్రాంతీయ సమతుల్యత, ఉద్యోగుల న్యాయ హక్కుల పరిరక్షణ కోసం ట్రిబ్యునల్ వ్యవస్థ ఏర్పాటైందని గుర్తుచేశారు. అనంతరం ఆర్టికల్ 323–ఏ, 1985లో అమల్లోకి వచ్చిన అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్స్ చట్టం ఆధారంగా ఈ వ్యవస్థ మరింత బలోపేతం చేయబడిందని వివరించారు.

ట్రిబ్యునల్ వ్యవస్థ ఉన్నప్పుడు నియామకాలు, సీనియారిటీ, పదోన్నతులు, బదిలీలు వంటి సేవా వివాదాలు తక్కువ కాలంలో పరిష్కారమయ్యేవని పేర్కొన్నారు. ప్రస్తుతం ట్రిబ్యునల్ రద్దుతో వేలాది కేసులు హైకోర్టులో పెండింగ్‌లో ఉండటం వల్ల ఉద్యోగులకు న్యాయం ఆలస్యమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది పరిపాలనా సామర్థ్యంపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతోందని తెలిపారు.

ట్రిబ్యునల్ పునరుద్ధరణతో సేవా వివాదాలకు వేగవంతమైన న్యాయ పరిష్కారం లభిస్తుందని, హైకోర్టుపై భారం తగ్గుతుందని, ఉద్యోగులకు తక్కువ వ్యయంతో న్యాయం అందుతుందని చెప్పారు. అలాగే కాంటెంప్ట్ చర్యలు తీసుకునే సౌలభ్యం కలుగుతుందని, పరిపాలనా వ్యవస్థపై విశ్వాసం పెరుగుతుందని వివరించారు.

రాజ్యాంగబద్ధ నిబంధనలు, చారిత్రక నేపథ్యం, ఉద్యోగుల న్యాయ హక్కులను పరిగణనలోకి తీసుకుని ఆంధ్రప్రదేశ్ పరిపాలనా ట్రిబ్యునల్‌ను తక్షణమే పునఃస్థాపించాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఫోర్టో నేతలు విజ్ఞప్తి చేశారు.

## గుంటూరు నూతన కలెక్టర్ సాయి కాంత్ వర్మకు ఎన్జీజీఓ సంఘం శుభాకాంక్షలు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సి. యం. సాయి కాంత్ వర్మను జిల్లా జేఏసీ చైర్మన్, ఏపీ ఎన్జీజీఓ సంఘ అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి ఏ. శ్యామ్ సుందర్ శ్రీనివాస్‌తో పాటు సంఘ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఘంటసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ, అధికార యంత్రాంగం, ఉద్యోగులు, ప్రజల సమన్వయంతో గుంటూరు జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు నడిపించాలని ఆకాంక్షించారు. జిల్లా సమగ్ర అభివృద్ధికి కలెక్టర్ సమర్థ నాయకత్వం అందిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. దీనికి స్పందించిన కలెక్టర్ సాయి కాంత్ వర్మ, జిల్లా అభివృద్ధి కోసం అందరి సహకారం అవసరమని పేర్కొన్నారు. అధికార యంత్రాంగం, ఉద్యోగులతో సమన్వయం సాధించి పారదర్శక పరిపాలన అందించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాల సమర్థ అమలు, అభివృద్ధి కార్యక్రమాల వేగవంతానికి ప్రాధాన్యం ఇస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్. శ్రీధర్ రెడ్డి, సిహెచ్ అనిల్, బి. కృష్ణ కిషోర్, డి. శ్రీనివాస్, కే. నరసింహారావు, కే. విజయ్, గుంటూరు సిటీ కార్యదర్శి సిహెచ్ కళ్యాణ్ కుమార్, సిటీ ట్రెజరర్ జీవి కోటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

## అమరావతి బిల్లును వ్యతిరేకిస్తూ లోక్‌సభ నుంచి వైసీపీ వాకౌట్



**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించటం కోసం బుధవారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన బిల్లును వైసీపీ వ్యతిరేకించింది. వైసీపీ సభ్యులు బిల్లును వ్యతిరేకిస్తూ సభనుంచి వాకౌట్ చేశారు. లోక్‌సభలో చర్చ సందర్భంగా వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత స్థితిలో ఉన్న బిల్లుకు తాము వ్యతిరేకమని స్పష్టం చేశారు. రాష్ట్ర రాజధాని నిర్ణయమన్నది రాష్ట్ర ఇష్టమని.. గతంలో హైకోర్టుకు కేంద్రం అఫిడవిట్ ఇచ్చిందని తెలిపారు. ఏపీ సభ్యులు ప్రత్యేక హోదా, పోలవరం నిధులపై మాట్లాడితే బాగుండేదని పేర్కొన్నారు. ఇప్పటివరకు అమరావతి రైతులకు ప్లాట్లు ఇవ్వలేదని అన్నారు.

ఆయన తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. 'అమరావతిపై కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు రూ. 5 వేల కోట్లే ఖర్చు చేసింది. రాజధాని రైతులకు ప్లాట్లు ఎప్పుడు ఇస్తారో బిల్లులో పెట్టాలి. రాజధాని కోసం వేల ఎకరాలు తీసుకోవాల్సిన అవసరం ఏముంది?. అమరావతి రైతులకు ఇచ్చిన హామీలు ఎప్పుడు నెరవేరుస్తారు?. 50 వేల ఎకరాలు ఉండగా.. మరో 50 వేల ఎకరాలు కావాలంటున్నారు. అదనపు భూసేకరణ ఎందుకు?. రాజధాని విషయంలో చంద్రబాబుకు స్పష్టత లేదు' అని అన్నారు.

## ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేసిన ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ

- రాజధాని అమరావతి చట్టబద్ధతతో రాష్ట్ర అభివృద్ధికి కొత్త దశ
- ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ వెల్లడి



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు పశ్చిమ నియోజకవర్గం, 36వ డివిజన్ స్తంభాలగరువు ప్రాంతంలో బుధవారం. ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ పింఛన్లు పంపిణీ చేశారు. గత ప్రభుత్వంరూ. 3 వేలు పెన్షన్ ఇస్తామని ఐదేళ్లపాటు ఊరించింది. ఏడాదికి రూ. 250 చొప్పున పెంచి ప్రజల కష్టాలతో ఆడుకుంది. కానీ చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన మొదటి నెలలోనే పెన్షన్‌ను రూ. 4 వేలకు పెంచి, 'చేతల ప్రభుత్వం' అంటే ఏంటో నిరూపించారు. వైసీపీ వికలాంగుల పెన్షన్ రూ 3 వేలు ఇస్తే కూటమి ప్రభుత్వం రూ. 6 వేలు చేసింది. తీవ్ర వైకల్యం ఉన్నవారికి గత ప్రభుత్వంలో వైసీపీ రూ. 5 వేలు ఇస్తే కూటమి ప్రభుత్వం రూ. 15,వేలు చేసింది. 1వ తేదీ తెల్లవారుజామునే అధికారులు లబ్ధిదారుల గడప తట్టి పెన్షన్ అందిస్తుంటే, లబ్ధిధారుల ముఖంలో కనిపిస్తున్న ఆనందమే ఈ ప్రభుత్వానికి అసలైన విజయం. పేదవాడి కడుపు నింపుతున్న మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, తోడుగా నిలుస్తున్న ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి మన్నవ మోహన కృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 36వ డివిజన్ అధ్యక్షులు నూలుపూరి శ్రీనివాసరావు , గుంటూరు పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పరుచూరి సంజీవరావు , గుంటూరు పశ్చిమ నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు ముత్తినేని శివలీలా పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ శాశ్వత రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందిన సందర్భంగా, ప్రజల ఆమోదం పొందిన రాజధాని అమరావతికి చట్టబద్ధత సాధించినందుకు ఆంధ్రప్రదేశ్ ప్రజలకు మన్నవ మోహనకృష్ణ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజధాని హైదరాబాద్‌ను ఐటీ హబ్‌గా అభివృద్ధి చేసిన నారా చంద్రబాబు నాయుడు , ఇప్పుడు ఏపీ రాజధాని అమరావతిని అంతకుమించి అభివృద్ధి చేస్తారని స్పష్టం చేశారు. అమరావతి రాష్ట్రాభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి అవకాశాల విస్తరణకు కేంద్రబిందువుగా నిలుస్తుందని మన్నవ మోహనకృష్ణ పేర్కొన్నారు.

## నిత్యం బాధితుల పక్షం...నిరంతరం న్యాయం వైపే పయనం



- 3వ సారి బార్ కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికైన వట్టిజొన్నల బ్రహ్మారెడ్డిని ఘనంగా సత్కరించిన ఎమ్మెల్సీలు లేళ్ళ అప్పిరెడ్డి, తలశిల రఘురాం

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** న్యాయం పక్షాన నిఖార్సుగా నిలబడే న్యాయవాది వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి అని శాసనమండలి సభ్యులు లేళ్ళ అప్పిరెడ్డి, తలశిల రఘురాం కొనియాడారు. వృత్తికే వన్నె తెచ్చే వ్యక్తిత్వం, న్యాయం కోసం వాదించడంలో గల అంకితభావం, క్రమశిక్షణకు మారుపేరైన బ్రహ్మారెడ్డి రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులుగా నియమితులవడం అత్యంత సముచితమని వారు అభిప్రాయపడ్డారు. ముచ్చటగా మూడోసారి రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులుగా నియమితులైన వట్టిజొన్నల బ్రహ్మారెడ్డికి వారు శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం గుంటూరులో జరిగిన ఒక కార్యక్రమంలో శాలువా, పుష్పగుచ్ఛంతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీలు లేళ్ళ అప్పిరెడ్డి, తలశిల రఘురాం మాట్లాడుతూ, వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి కింది స్థాయి నుంచి కృషి, పట్టుదలతో తాను ఎంచుకున్న న్యాయ వ్యవస్థలో అంచెలంచెలుగా ఎదిగారని తెలిపారు. నీతి నిజాయితీతో న్యాయం వైపు నిలబడడం ద్వారా న్యాయవాద కుటుంబంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నారని కితాబిచ్చారు. మొదటి నుంచి కూడా నిరుపేద వర్గాలకు చెందిన బాధితులకు ఉచితంగా న్యాయ సహాయం అందజేయడమే కాక వారికి న్యాయం జరిగేవరకు రాజీ లేని పోరాటం చేయడం బ్రహ్మారెడ్డి నైజమని ప్రశంసించారు. తొలి అడుగు నుంచి న్యాయానికి కొమ్ము కాసే నైజాన్ని తన అలవాటుగా మలచుకున్న బ్రహ్మారెడ్డి సహజంగానే మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ ఆలోచనలు, ఆశయాల పట్ల ఆకర్షితులై, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ స్థాపించిన నాటి నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలకు నిస్వార్థంగా అండగా నిలుస్తూ వచ్చారని అభినందించారు. అక్రమ కేసులతో అధికార పక్షం గురి చేస్తున్న వేధింపుల నుంచి వైసీపీ నేతలు, కార్యకర్తలకు ఉపశమనం కలిపించడంలో ఆయన పాత్ర కీలకమని వ్యాఖ్యానించారు. బార్ కౌన్సిల్ సభ్యుడిగా బాధితుల పక్షాన ఆయన భవిష్యత్తులో మరింత రాజీ లేని పోరాటం చేస్తారన్న ఆశాభావాన్ని వారు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు గులాం రసూల్, పరిశపోగు శ్రీనివాసరావు, పానుగంటి చైతన్య, దూపాటి వంశీ, రబ్బానీ, రవి నాయుడు, గోపి యాదవ్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

## వికసిత కేరళం మేనిఫెస్టోకు విశేష ప్రజాదరణ

- వల్లూరు జయప్రకాశ్ నారాయణ





**నేషనల్ డెస్క్ (జర్నలిస్ట్ ఫైల్) :** అరణ్ముల అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్డీయే గెలుపే లక్ష్యంగా బీజేపీ శ్రేణులు సమన్వయంతో పనిచేస్తున్నాయని నియోజకవర్గ ఎన్నికల ఇంచార్జీ వల్లూరు జయప్రకాశ్ నారాయణ తెలిపారు. కేంద్ర మంత్రి శోభా కరంద్లాజే పర్యటనతో పార్టీ కార్యకలాపాలకు మరింత ఊపు వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

ఎలక్షన్ ప్రవాస యోజనలో భాగంగా అరణ్ములలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎన్డీయే అభ్యర్థి, మాజీ గవర్నర్ కుమ్మనం రాజశేఖరన్‌కు ప్రజల్లో మంచి స్పందన లభిస్తున్నదన్నారు. ప్రతి బూత్ స్థాయిలో పార్టీ శ్రేణులు చురుకుగా పనిచేస్తూ ప్రచారాన్ని విస్తృతం చేస్తున్నాయని వివరించారు.

'వికసిత కేరళం విజన్ 2026' మేనిఫెస్టోను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నామని, పేద మరియు మధ్యతరగతి వర్గాలకు ఉపశమనం కలిగించే పథకాలు ప్రజలను ఆకట్టుకుంటున్నాయని తెలిపారు. సంవత్సరానికి రెండు ఉచిత ఎల్పీజీ సిలిండర్లు, మహిళలకు నెలకు రూ. 2,500 ఆర్థిక సాయం, వృద్ధులకు రూ. 3,000 పెన్షన్ వంటి హామీలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతున్నాయని చెప్పారు.

రాష్ట్రంలో ఎల్డీఎఫ్, యూడీఎఫ్ ప్రభుత్వాలు ప్రజల ఆశలను నెరవేర్చలేకపోయాయని విమర్శించిన ఆయన, ఈసారి ప్రజలు మార్పు కోరుకుంటున్నారని అన్నారు. బీజేపీకి అవకాశం ఇస్తే అరణ్ముల అభివృద్ధికి కొత్త దిశ చూపుతామని భరోసా ఇచ్చారు.

అరణ్ముల ఎన్డీయే కార్యాలయానికి విచ్చేసిన కేంద్ర మంత్రి శోభా కరంద్లాజేను, అరణ్ముల ఎన్డీయే అభ్యర్థి, మాజీ గవర్నర్ కుమ్మనం రాజశేఖరన్, నియోజకవర్గ ఎన్నికల ఇంచార్జీ వల్లూరు జయప్రకాశ్ నారాయణతో పాటు స్థానిక పార్టీ శ్రేణులు ఘనంగా సత్కరించారు.

ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 482 మంది వైద్యులకు నియామక ఉత్తర్వుల జారీ

- ఆన్ లైన్ ద్వారా కౌన్సిలింగ్
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** ప్రజారోగ్య శాఖ (డైరెక్టర్ అఫ్ పబ్లిక్ హెల్త్–డీహెచ్) ద్వారా శాశ్వత ప్రాతిపదికన (రెగ్యులర్ )482 మంది వైద్యులకు బుధవారం నియామక ఉత్తర్వులు జారీచేసినట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఉత్తర్వులు పొందిన వారు 15 రోజుల్లోగా విధుల్లో చేరాలని పేర్కొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెడికల్ ఆఫీసర్లు, బోధనాసుపత్రుల్లో ట్యూటర్ల కేటగిరిలో కలిపి 636 పోస్టుల భర్తీకి కిందటేడాది నోటిఫికేషన్ (13/2025) జారీచేయగా సుమారు 5వేల వరకు దరఖాస్తులు వచ్చాయి. ఎంబీబీఎస్ అర్హతతో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి రిజర్వేషన్, ఇతర నియమ నిబంధనల ప్రకారం ఎంపిక చేసిన జాబితాను మార్చి 11న నియామక బోర్డు ప్రకటించింది. దీనికి అనుగునంగా స్పోర్ట్స్ కేటగిరి మినహాయించి 611 పోస్టుల భర్తీ చర్యల్లో భాగంగా ఎంపికైన వారి నుంచి సోమవారం ఉదయం 11 నుంచి మంగళవారం రాత్రి 9 గంటల వరకు ఆప్షన్లు (ఐచ్ఛికాలు) స్వీకరించారు. తొలుత ప్రకటించిన సమయం కంటే అభ్యర్థుల విజ్ఞప్తిమేరకు అప్షన్ల నమోదు సమయాన్ని అదనంగా పెంచారు. నియామక కౌన్సిలింగ్ ప్రక్రియ, పోస్టింగ్ ఉత్తర్వులు జారీ పూర్తిగా పారదర్శకంగా ఆన్లైన్ లో జరిగింది.

**ఆప్షన్లకు అనుగుణంగా.. :** 611 పోస్టులకుగాను 482 మంది అభ్యర్థులు స్పందించారు. నియమ నిబంధనలు అనుసరించి, వీరందరికీ ఆన్లైన్ ద్వారానే బుధవారం పోస్టింగు ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాగిత రహితంగానే ఈ ప్రక్రియ మొత్తం జరిగింది. ఇంతకుముందు వరకు జూమ్ కాన్ఫరెన్స్ విధానంలో డిస్ప్లే చేసిన ఖాళీలకు అనుగుణంగా అభ్యర్థులు స్థానాలు ఎంపికచేసుకుని పోస్టింగులు పొందారు. ఈ సారి నియామకాల్లో మరింత పారదర్శకత పెరిగేలా ఆన్లైన్ కౌన్సెలింగ్ను నిర్వహించారు. ఆసుపత్రుల వారీగా ప్రకటించిన పోస్టులన్నింటికీ ప్రాధాన్య క్రమంలో అభ్యర్థులు అప్షన్లు ఇచ్చుకున్నారు. దీని ప్రకారం ఆన్లైన్ ద్వారానే అభ్యర్థులకు పోస్టింగులు ఉత్తర్వులు జారీచేసినట్లు ప్రజారోగ్య శాఖ సంచాలకులు డాక్టర్ పద్మావతి వెల్లడించారు పోస్టింగులు ఇచ్చిన 482లో కొన్ని ట్యూటర్ల పోస్టులు ( బోధన ఆస్పత్రులు) ఉన్నాయని వెల్లడించారు.

**జిల్లాల వారీగా..! :** రాష్ట్రంలోనే అత్యధికంగా కడప జిల్లాలో 52 మందికి పోస్టింగులు ఉత్తర్వులు ఇచ్చారు తరువాత అనంతపురం–34, శ్రీకాకుళం–31, కాకినాడ–29, కర్నూలు–27, పల్నాడు–26, ఎన్టీఆర్–23, నంద్యాల–19, కృష్ణా–19, ప్రకాశం–17, ఏలూరు–17, విజయనగరం– 16, పశ్చిమగోదావరి–15, గుంటూరు–14, పార్వతీపురం మన్యం–14, అంబేద్కర్ కోనసీమ–13, అల్లూరి సీతారామరాజు–13, ఈస్ట్ గోదావరి– 12, వైజాగ్–12, చిత్తూరు–12, మార్కాపురం–11, సత్యసాయి–11, అన్నమయ్య–10, నెల్లూరు జిల్లాలో పది చొప్పున పోస్టుల భర్తీ ఉత్తర్వులు ఇచ్చామని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ పద్మావతి చెప్పారు. మిగిలిన జిల్లాల్లో పది కంటే తక్కువగా పోస్టింగు ఉత్తర్వులు ఇచ్చినట్లు వెల్లడించారు. స్పోర్ట్స్, ఎక్స్ సర్వీస్మెన్ కేటగిరిలో ఉన్న 19 పోస్టులను త్వరలో భర్తీ చేస్తామని తెలిపారు. 2024, డిసెంబరులో డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ జారీచేసిన నోటిఫికేషన్ ద్వారా 392 మంది వైద్యాధికారులు పోస్టింగులు పొందారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467